సాక్షి
భద్రాద్రి కొత్తగూడెం

శనివారం । 22 । జూన్ । 2024



అన్నదాతకు 'మద్దతు'

రైతులు సాగు చేసే వరి, పత్తి, మొక్కజొన్నతో పాటు పెసర, మినుము, కంది వంటి పంటలకు ప్రభుత్వం మద్దతు ధరలను పెంచింది. 8లో



ఆదివాసీలకు ఆపన్నహస్తం

చర్లలోని వారసంతకు జిల్లాతో పాటు ఛత్తీస్‌గఢ్ నుంచి వచ్చే ఆదివాసీలకు 134 వారాలుగా అన్నదానం చేస్తున్నారు. 10లో

వాతావరణం

గరిష్టం / కనిష్టం
30° / 25°

జిల్లాలో శనివారం ఆకాశం మేఘావృతమై ఉంటుంది. కొన్ని ప్రాంతాల్లో మాత్రం సాధారణ ఉష్ణోగ్రతలు నమోదవుతాయి.

న్యూస్‌రీల్

పెద్దమ్మతల్లి ఆలయంలో చండీహోమం



స్వామివారిని ఊరేగింపుగా తీసుకొస్తున్న అర్చకులు, భక్తులు

పాల్వంచరూరల్: మండలంలోని కేశవాపురం – జగన్నాధపురం గ్రామాల మధ్య కొలువైన శ్రీకనకదుర్గ(పెద్దమ్మతల్లి)ఆలయంలో పౌర్ణమిని పురస్కరించుకుని శుక్రవారం అమ్మవారికి పంచామృతాభిషేకం, పూజలు, చండీహోమం నిర్వహించారు. తొలుత మేళతాళాలు, వేదమంత్రోచ్ఛరణల నడుమ స్వామిని అర్చకులు ఊరేగింపుగా తీసుకొచ్చారు. హోమం అనంతరం పూర్ణాహుతి నిర్వహించారు. కార్యక్రమంలో అర్చకులు, ఈఓ ఎన్.రజనీకుమారితో పాటు పెద్దసంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. కాగా, పెద్దమ్మతల్లి ఆలయ పునర్నిర్మాణానికి మణుగూరుకు చెందిన గుగులోతు హతీరామ్ – పద్మ దంపతులు రూ.5,116 విరాళం అందజేసినట్లు ఈఓ తెలిపారు.

అదను చూసి విత్తనాలు వేయాలి

జిల్లా వ్యవసాయ శాఖాధికారి బాబూరావు



పత్తి మొక్కలను పరిశీలిస్తున్న బాబూరావు

టేకులపల్లి : రైతులు తొందరపడి విత్తనాలు వేయొద్దని, అదను చూసి విత్తుకోవాలని జిల్లా వ్యవసాయ శాఖ అధికారి వేల్పుల బాబూరావు అన్నారు. మండలంలోని తొమ్మిదోమైలు తండాలో శుక్రవారం ఆయన పర్యటించారు. అక్కడక్కడ మొలకెత్తిన పత్తి మొక్కలను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఇప్పుడే విత్తనాలు వేస్తే వర్షాలు లేక అవి మొలకెత్తవని, తద్వారా రైతులు నష్టపోవాల్సి వస్తుందని సూచించారు. గుర్తింపు పొందిన డీలర్ల వద్దే విత్తనాలు కొనుగోలు చేయాలని, తప్పనిసరిగా రసీదు తీసుకోవాలని చెప్పారు. నకిలీ విత్తనాలు, నిషేధిత గడ్డి మందు విక్రయిస్తే వ్యాపారులపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. గ్రామాల్లో ఎవరైనా అనుమతి లేని విత్తనాలు విక్రయిస్తే సమాచారం ఇవ్వాలని కోరారు. ఆయన వెంట ఏఓ నీరుడు అన్నపూర్ణ, ఏఈఓలు శ్రావణి, విశాల ఉన్నారు.

డ్రైవింగ్ టెస్ట్‌లో 829 మంది ఉత్తీర్ణత

కొత్తగూడెంఅర్బన్(సింగరేణి): సింగరేణిలో ఖాళీగా ఉన్న 68 ఈపీ ఆపరేటర్(కేటగిరీ–4) పోస్టుల భర్తీకి ఈనెల 18 నుంచి శుక్రవారం వరకు సంస్థ వ్యాప్తంగా అధికారులు డ్రైవింగ్ పరీక్ష నిర్వహించారు. ఇందులో 1,706 మంది పాల్గొనగా 829 మంది ఉత్తీర్ణత సాధించారని జీఎం(పర్సనల్) బీ.ఆర్.దీక్షితులు తెలిపారు. వీరికి ఈనెల 30న కొత్తగూడెంలోని సింగరేణి మహిళా డిగ్రీ కళాశాలలో రాత పరీక్ష నిర్వహించి సాధించే మార్కులు, రిజర్వేషన్ ఆధారంగా నియామకాలు చేపడతామని వెల్లడించారు.

నకిలీపై నజర్

- కల్తీ విత్తనాల నియంత్రణకు టాస్క్‌ఫోర్స్ కమిటీలు
- విత్తన షాపుల్లో విస్తృతంగా తనిఖీలు



విత్తన దుకాణంలో తనిఖీ చేస్తున్న టాస్క్‌ఫోర్స్ అధికారులు (ఫైల్)

సూపర్‌బజార్(కొత్తగూడెం): జిల్లాలో నకిలీ విత్తనాలను అరికట్టడంపై అధికారులు ఫోకస్ పెట్టారు. గత యాసంగి సీజన్‌లో ములకలపల్లి, పాల్వంచ తదితర మండలాల్లో నకిలీ విత్తనాలు వేసిన కొందరు రైతులు నష్టపోయారు. ఆయా రైతులు విత్తనాలు కొనుగోలు చేసిన దుకాణాల ఎదుట ఆందోళన చేయడంతో పాటు, కొందరు కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. ఈ ఘటనపై ఉన్నతాధికారులు కొత్తగూడెం కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్తలతో విచారణ జరిపించినా.. ఆ రైతులు వేసిన విత్తనాలు కల్తీవా, మంచివా అనే విషయం ఇప్పటికీ తేలలేదు. ఇక ప్రస్తుత వానాకాలం సీజన్ ప్రారంభానికి ముందే వ్యవసాయ శాఖతో పాటు కొత్తగూడెం కృషి విజ్ఞానకేంద్రం ఆధ్వర్యంలో విత్తనాల ఎంపికపై రైతులకు అవగాహనా కార్యక్రమాలు నిర్వహించారు. జిల్లాలోని ఐదు నియోజకవర్గాల్లో ఒక్కో రైతు వేదికను ఎంపిక చేసి రైతునేస్తం పేరిట వీడియో కాన్ఫరెన్స్‌ల ద్వారా విత్తనాల ఎంపికపై పలు సూచనలు చేశారు. వానాకాలం సీజన్‌లో నకిలీ విత్తనాలతో రైతులు నష్టపోకుండా పటిష్ట చర్యలు చేపట్టాలని నిర్ణయించిన జిల్లా అధికారులు.. ఇల్లెందు, అశ్వారావుపేట కేంద్రాలుగా రెండు టాస్క్‌ఫోర్స్ కమిటీలను ఏర్పాటు చేశారు. వ్యవసాయ, రెవెన్యూ, పోలీస్ శాఖల వారు సభ్యులుగా ఉండే ఈ కమిటీలు జిల్లా వ్యాప్తంగా విత్తన దుకాణాల్లో తనిఖీలు నిర్వహిస్తున్నాయి.

బిల్లులు తీసుకోవాలి..

జిల్లా వ్యాప్తంగా తనిఖీలు నిర్వహిస్తున్న టాస్క్‌ఫోర్స్ కమిటీలు ఆయా దుకాణాల్లో విక్రయిస్తున్న విత్తనాలు నాణ్యమైన కంపెనీలవేనా అని పరిశీలిస్తున్నారు. పలు రికార్డులు, ఇన్వాయిస్ ఫైళ్లు, ఫారం సీ బిల్లు పుస్తకాలు, ప్రస్తుత నిల్వలను తనిఖీ చేస్తున్నారు. విత్తనాలు ఎమ్మార్పీకి మించి విక్రయించినా, నకిలీ విత్తనాలు రైతులకు అంటగట్టినా కఠిన చర్యలు తప్పవని వ్యాపారులను హెచ్చరిస్తున్నారు. రైతులు కూడా విత్తనాలు, ఎరువులు కొనుగోలు చేసినప్పుడు విధిగా బిల్లులు తీసుకోవాలని, పంట దిగుబడి వచ్చేంతవరకు విత్తనాల బిల్లులు భద్రపర్చుకోవాలని సూచిస్తున్నారు. కమిటీలో పోలీసులు కూడా సభ్యులుగా ఉండడం, ఎస్పీ రోహిత్‌రాజ్ తరచుగా విత్తన, ఎరువుల వ్యాపారులతో సమావేశాలు నిర్వహించి సూచనలు చేస్తుండడంతో నకిలీ విత్తనాలు విక్రయించే వారి గుండెల్లో రైళ్లు పరుగెత్తుతున్నాయని తెలుస్తోంది.

కేవీకే ఆధ్వర్యంలో విత్తన మేళా..

విత్తనాల కొనుగోళ్లలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై కొత్తగూడెం కృషి విజ్ఞాన కేంద్రం ప్రోగ్రామ్ కో ఆర్డినేటర్ డాక్టర్ వి.లక్ష్మీనారాయణమ్మ ఆధ్వర్యంలో నిర్వహించిన విత్తన మేళా కూడా రైతులకు దోహదపడింది. నాణ్యమైన విత్తనాలు ఎక్కడ లభిస్తాయి, ఎలాంటివి ఎంపిక చేసుకోవాలి తదితర అంశాలపై ఈ మేళాలో అవగాహన కల్పించారు.

జాగ్రత్తలు పాటిస్తే అధిక దిగుబడి



పంటల సాగులో రైతులు వ్యవసాయ అధికారుల సలహాలు, సూచనలు తీసుకుంటూ జాగ్రత్తలు పాటిస్తే అధిక దిగుబడులు వస్తాయి. తద్వారా వారికి ఆర్థిక పరిపుష్టి లభిస్తుంది. ఈ దిశగా ఇప్పటికే రైతులకు అవగాహన కల్పించాం. నకిలీ విత్తనాలు, ఎరువుల నివారణకు టాస్క్‌ఫోర్స్ కమిటీలు ఏర్పాటు చేశాం.

– వి బాబూరావు, జిల్లా వ్యవసాయాధికారి

విత్తన కొనుగోళ్లలో అవగాహన ఉండాలి



విత్తన కొనుగోళ్లలో రైతులకు అవగాహన అవసరం. ఇందుకోసం జిల్లా వ్యాప్తంగా రైతులతో విత్తన మేళాలు నిర్వహించి చైతన్య పరుస్తున్నాం. కేవీకే శాస్త్రవేత్తలు కూడా క్షేత్రస్థాయిలో పర్యటిస్తూ రైతుల సందేహాలను నివృత్తి చేస్తున్నారు.

– డాక్టర్ వి. లక్ష్మీనారాయణమ్మ, కేవీకే ప్రోగ్రామ్ కో ఆర్డినేటర్

రామయ్యకు స్వర్ణకవచాలంకరణ



నదీ జలాన్ని తీసుకొస్తున్న అర్చకులు

భద్రాచలం: భద్రాచలం శ్రీ సీతారామచంద్రస్వామి వారి మూలమూర్తులు శుక్రవారం స్వర్ణ కవచధారులై భక్తులకు దర్శనమిచ్చారు. తెల్లవారుజామున గర్భగుడిలో స్వామివారికి సుప్రభాత సేవ, సేవాకాలం, ఆరాధన తదితర పూజలు చేశారు. అనంతరం బేడా మండపంలో కొలువుదీర్చి విశ్వక్సేన పూజ, పుణ్యావాచనం చేశారు. స్వామివారికి కంకణధారణ, యజ్ఞోపవీత ధారణ, అమ్మవారికి కంకణ, యోక్త్రధారణ గావించి నిత్యకల్యాణ ఘట్టాన్ని ఆలయ అర్చకులు శాస్త్రోక్తంగా నిర్వహించారు. భక్తులు స్వామి వారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. కాగా, శుక్రవారాన్ని పురస్కరించుకుని శ్రీ లక్ష్మీతాయారు అమ్మవారికి అభిషేకం, ప్రత్యేక పూజలు చేశారు.

జ్యేష్ఠాభిషేకానికి అంకురార్పణ

భద్రాచలం శ్రీ సీతారామచంద్రస్వామి దేవస్థానంలో శనివారం జరగనున్న జ్యేష్ఠాభిషేకానికి శుక్రవారం అంకురార్పణ చేశారు. పవిత్ర గోదావరి నుంచి మేళతాళాలు, మంగళవాయిద్యాల నడుమ తీర్థబిందె తీసుకొచ్చారు. జ్యేష్ఠ పౌర్ణమి, ఏరువాక పౌర్ణమిని పురస్కరించుకుని రామాలయంలో ప్రతీ ఏడాది ఈ కార్యక్రమం నిర్వహించడం ఆనవాయితీ అని అర్చకులు తెలిపారు. బేడా మండపంలో 81 కలశాల్లో సమస్త నదీ జలాలను ఆవాహన చేసి స్వామివారికి అభిషేకం చేస్తామని, ఈ సందర్భంగా నిత్యకల్యాణం రద్దు చేశామని పేర్కొన్నారు

యోగాతో సంపూర్ణ ఆరోగ్యం

జిల్లా ప్రధాన న్యాయమూర్తి పాటిల్‌వసంత్



యోగా చేస్తున్న జిల్లా జడ్జి పాటిల్‌వసంత్



యోగా చేస్తున్న డీఎంహెచ్‌ఓ తదితరులు

కొత్తగూడెంటౌన్: యోగాతో మానవునికి సంపూర్ణ ఆరోగ్యం సిద్ధిస్తుందని, ప్రశాంత జీవనానికి మార్గం చూపుతుందని జిల్లా ప్రధాన న్యాయమూర్తి పాటిల్ వసంత్ అన్నారు. శుక్రవారం ప్రపంచ యోగా దినోత్సవం సందర్భంగా జిల్లా కోర్టు ప్రాంగణంలో యోగా శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా జడ్జి మాట్లాడుతూ.. ప్రతీ ఒక్కరు దిన చర్యలో యోగాను భాగం చేసుకోవాలని అన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి గొల్లపూడి భానుమతి, జూనియర్ సివిల్ జడ్జి బత్తుల రామారావు, న్యాయమూర్తులు కె.సాయిశ్రీ, వి.శివ నాయక్, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు లక్కినేని సత్యనారాయణ, పబ్లిక్ ప్రాసిక్యూటర్ పోసాని రాధాకృష్ణమూర్తి, న్యాయవాదులు మెండు రాజమల్లు, రాజేశ్వరావు తదితరులు పాల్గొన్నారు.

మెడికల్ కళాశాలలో..

కొత్తగూడెంరూరల్: జిల్లా వైద్య కళాశాలలో యోగా డే నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎంహెచ్‌ఓ భాస్కర్‌నాయక్ మాట్లాడుతూ.. యోగాతో అనేక ఉపయోగాలు ఉన్నాయని చెప్పారు. శ్వాసను నియంత్రించేందుకు ఉపకరిస్తుందని, ఊపిరితిత్తులు సక్రమంగా పనిచేసేలా చూస్తుందని అన్నారు. ప్రతీ ఒక్కరూ యోగా చేయడం అవసరమని అన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ డీఎంహెచ్‌ఓ సుకృత, వైద్య కళాశాల ప్రిన్సిపాల్ లక్ష్మణ్‌రావు, రాజేకుమార్, ఎం వెంకటేశ్వర్లు, డాక్టర్ వనిత, డీపీఎం దుర్గ పాల్గొన్నారు.

ఆదర్శ పాఠశాలల్లో మరమ్మతులు పూర్తి చేయాలి

కలెక్టర్ జితేష్ వి పాటిల్



శ్రీతేజను అభినందిస్తున్న కలెక్టర్

సూపర్‌బజార్(కొత్తగూడెం): జిల్లాలోని అమ్మ ఆదర్శ పాఠశాలల్లో మరమ్మతు పనులు త్వరగా పూర్తి చేయాలని కలెక్టర్ జితేష్ వి పాటిల్ అధికారులను ఆదేశించారు. పలు శాఖల అధికారులతో కలెక్టరేట్ నుంచి శుక్రవారం ఆయన డీఆర్డీఓ విద్యాచందనతో కలిసి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మాట్లాడారు. జిల్లాలో 697 పాఠశాలల ఆవరణ లేదా తరగతి గదిలో స్టీల్ ట్యాంక్ ఏర్పాటుచేసి దానికి సెడ్మెంట్ ఫిల్టర్‌ను అమర్చాలని సూచించారు. దీంతో విద్యార్థులకు స్వచ్ఛమైన తాగునీరు అందుతుందని, వర్షాకాలంలో వచ్చే వ్యాధులను నివారించవచ్చని అన్నారు. విద్యార్థులు భోజన సమయంలో చేతులు, భోజనానంతరం ప్లేట్లు కడుక్కునేందుకు వీలుగా స్టీల్ వాష్‌బేసిన్లు ఏర్పాటు చేయాలన్నారు. తరగతి గదుల్లో ట్యూబ్‌లైట్లు, ఫ్యాన్లు బిగించాలని, వైరింగ్ మొత్తం కన్సిల్డ్ పద్ధతిలో చేయించాలని సూచించారు. మరుగుదొడ్లలో టైల్స్ కాకుండా కాంక్రీట్ ఫ్లోరింగ్ చేయించి రెడాక్సైడ్ వేయాలని అన్నారు. ప్రతీ పాఠశాల ఆవరణలో మునగ, చింత, కరివేపాకు, ఉసిరి, వెలక్కాయ వంటి ఎత్తయిన చెట్లు నాటాలని, పిల్లల అహ్లాదం కోసం మల్లె, మందార, కనకాంబరం, నందివర్ధనం, గులాబీ మొక్కలు పెంచాలని చెప్పారు. ఆరోగ్య రీత్యా తులసి, ఇన్సూలిన్ ప్లాంట్, రణపాల, నేల ఉసిరి, తిప్పతీగ మొక్కలు ఏర్పాటు చేయాలన్నారు. వీడియో కాన్ఫరెన్స్‌లో పంచాయతీరాజ్ ఈఈ శ్రీనివాస్, ఆర్అండ్‌బీ ఈఈ వెంకటేశ్వర్లు, డీఈఓ వెంకటేశ్వరాచారి, ఆర్అండ్‌బీ డీఈ నాగేశ్వరరావు, మున్సిపల్ డీఈ రవికుమార్, మెప్మా పీడీ రాజేష్, సెర్ప్ డీపీఎం నాగజ్యోతి, రంగారావు తదితరులు పాల్గొన్నారు.

అథ్లెట్‌కు అభినందన..

ఛత్తీస్‌గఢ్‌లోని బిలాస్‌పూర్‌లో ఈనెల 15 నుంచి 17 వరకు జరిగిన జాతీయ యూత్ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్‌లో జిల్లాకు చెందిన తోలెం శ్రీతేజ హెప్టాత్లాన్ ఈవెంట్‌లో రాష్ట్రం తరఫున పాల్గొని 4,136 పాయింట్లతో జాతీయస్థాయిలో తృతీయ స్థానం సాధించి కాంస్య పతకాన్ని కైవసం చేసుకున్నాడు. ఈ సందర్భంగా కలెక్టర్ పాటిల్ శుక్రవారం శ్రీతేజను అభినందించారు. అనంతరం మాట్లాడుతూ.. తాను కూడా అథ్లెటిక్స్‌లో ఢిల్లీలో సాధన చేశానని, 400 మీటర్ల పరుగుపందేన్ని 53 సెకన్లలో పూర్తి చేశానని గుర్తు చేసుకున్నారు. అథ్లెటిక్స్‌లో బాగా సాధన చేసి అంతర్జాతీయ స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. శ్రీతేజకు అథ్లెటిక్స్ షూ అందజేయాలని జిల్లా క్రీడల అధికారి సంజీవరావును ఆదేశించారు. శ్రీతేజ కోచ్ పి.నాగేందర్, జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ జనరల్ సెక్రటరీ కె మహీధర్‌ను కూడా కలెక్టర్ అభినందించారు. కార్యక్రమంలో క్రీడా కార్యాలయ సూపరింటెండెంట్ ఉదయ్‌కుమార్, తిరుమలరావు పాల్గొన్నారు.

భూమాయపై ఆరా..!

- వివరాలు సేకరించిన రెవెన్యూ, ఇంటెలిజెన్స్ అధికారులు
- ఫైల్ మాయం కాలేదని తహసీల్దార్ వెల్లడి

సాక్షి ఎఫెక్ట్..

అశ్వారావుపేటరూరల్: కాకతీయ యూనివర్సిటీ గురుకుల పాఠశాలకు సంబంధించిన విలువైన భూములపై రెవెన్యూ శాఖ జిల్లా ఉన్నతాధికారులతో పాటు ఇంటెలిజెన్స్ విభాగం అధికారులు ఆరా తీశారు. 'సాక్షి'లో శుక్రవారం 'పేట'లో భూమాయ శీర్షికన ప్రచురితమైన కథనానికి వారు స్పందించారు. దీంతో భూ ఆక్రమణదారుల్లో ఆందోళన మొదలైంది. అశ్వారావుపేట రెవెన్యూ పరిధిలోని అల్లిగూడెం గ్రామ సమీపంలో సర్వే నంబర్ 1228/206, 1228/207ఏ ద్వారా గురుకుల పాఠశాలకు 50 ఎకరాలు కేటాయించగా, నాటి తహసీల్దార్ ప్రద్యుమ్నా రెడ్డి ఆధ్వర్యంలో 2008 జనవరి 6న పంచనామా చేసి, సరిహద్దులు నిర్ధారించారు. ఈ భూమిని కాకతీయ యూనివర్సిటీ అధికారులకు స్వాధీనం చేశారు. ఆ తర్వాత వివిధ కారణాలతో గురుకులం ఏర్పాటు రద్దు కాగా, ఈ భూములను కొందరు ఆక్రమించారు. భూములకు సంబంధించిన కీలక ఫైల్ ఎట్టకేలకు బయటకు రావడంతో ఉన్నతాధికారులు విచారణకు ఆదేశించారు. ఈ ప్రభుత్వ భూముల వివరాలు కావాలని స.హ.చట్టం ద్వారా ఓ పౌరుడు దరఖాస్తు చేస్తే, స్థానిక రెవెన్యూ ఉద్యోగి నిర్లక్ష్యంగా వ్యవహరించినట్లు తేలడంతో ఆ ఉద్యోగి తీరుపై ఉన్నతాధికారులు ఆగ్రహం వ్యక్తం చేసినట్లు తెలిసింది. తనకు తప్పుడు సమాచారం ఇచ్చారంటూ సదరు పౌరుడు కూడా ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేయనున్నట్లు సమాచారం. భూ ఆక్రమణలపై అప్పటి ఎమ్మెల్యే జలగం వెంకట్రావు సైతం దృష్టి సారించారని ప్రచారం సాగుతోంది.

ఆ భూములు రద్దు చేశారు

కేయూ గురుకులానికి సర్వే నంబర్లు 1228లో 50 ఎకరాలు కేటాయించిన మాట వాస్తవమే. దీనికి సంబంధించిన ఫైల్ మాయం కాలేదు. ఈ భూములు కేటాయించాక గురుకుల పాఠశాల ఏర్పాటు కాకపోవడంతో 2010లో నాటి ఉమ్మడి జిల్లా కలెక్టర్ వి.ఉషారాణి భూకేటాయింపులు రద్దు చేస్తూ ఆదేశాలు జారీ చేశారు. ప్రస్తుతం ఆయా భూముల్లో ఉన్న ఆక్రమణదారుల వివరాలు సేకరించి, తగిన చర్యలు తీసుకుంటాం.

– కృష్ణ ప్రసాద్, తహసీల్దార్

అంగన్‌వాడీల్లోనూ యూనిఫామ్..

- జిల్లాలో మొదట 626 కేంద్రాల్లో అమలు
- జూలై మొదటి వారంలో పంపిణీకి ఏర్పాట్లు
- తొలివిడతలో 7,200 మంది చిన్నారులకు..
- జిల్లాకు చేరిన నాలుగు రకాల వస్త్రాలు
- తయారీ బాధ్యత మహిళా సంఘాలకు



అంగన్‌వాడీ కేంద్రంలో చదువుకుంటున్న చిన్నారులు (ఫైల్)

భద్రాచలంఅర్బన్ : అంగన్‌వాడీ కేంద్రాల్లోనూ ఇకపై యూనిఫామ్ అందించనున్నారు. ఈ మేరకు ప్రభుత్వం నిర్ణయం తీసుకోగా.. ఈ ఏడాది నుంచే అమల్లోకి రానుంది. ఒక్కో విద్యార్థికి జత చొప్పున పంపిణీ చేయనుండగా.. ఇప్పటికే నాలుగు రకాల క్లాత్ జిల్లాకు చేరుకుంది. వచ్చే నెల మొదటి వారంలో యూనిఫామ్ పంపిణీకి అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. ప్రభుత్వ స్కూళ్లలో చదువుతున్న విద్యార్థులకు రాష్ట్ర ప్రభుత్వం ఉచితంగా రెండు జతల యూనిఫామ్ అందిస్తోంది. ఇందులో భాగంగా జిల్లాలో ప్రస్తుతం ఒక జత ఇవ్వగా, త్వరలో రెండో జత ఇచ్చేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు. ఇప్పటి వరకు స్కూళ్లలో చదువుతున్న విద్యార్థులకే ఇస్తుండగా.. ఇక నుంచి అంగన్‌వాడీ కేంద్రాల్లో చదువుతున్న చిన్నారులకు కూడా యూనిఫామ్ ఇవ్వనున్నారు. ప్రీ ప్రైమరీ పాఠశాలల్లో 3 నుంచి 5 ఏళ్లలోపు చిన్నారులు చదువుతుంటారు. జిల్లాలో మొత్తం 2,060 అంగన్‌వాడీ కేంద్రాలు ఉండగా, తొలుత స్కూళ్ల ప్రాంగణాల్లో ఉన్న 626 అంగన్‌వాడీల్లోని 7,200 మంది చిన్నారులకు యూనిఫామ్ అందించనున్నారు. మిగతావి రెండో దశలో అమలు చేయనున్నట్లు అధికారులు చెబుతున్నారు.

నాలుగు రంగుల్లో క్లాత్..

చిన్నారుల యూనిఫామ్‌కు సంబంధించి ఇప్పటికే డిజైన్ ఫైనల్ చేశారు. ఎరుపు, యాష్ కలర్, నీలం, తెలుపు రంగుల్లో క్లాత్ ఉంటుంది. జిల్లాకు ఇప్పటికే 7,759 మీటర్ల వస్త్రం చేరుకోగా వీటిలో యాష్ ఫ్లోరల్ 5,385 మీటర్లు, బ్లూ రంగు క్లాత్ 1,394 మీటర్లు, తెలుపు వస్త్రం 980.4 మీటర్లు ఉన్నాయి. ఎరుపు రంగ వస్త్రం ఇంకా జిల్లాకు చేరుకోలేదు.

మహిళా సంఘాలతో స్టిచింగ్..

యూనిఫామ్ తయారీ బాధ్యతను మహిళా సంఘాల సభ్యులకు అప్పగించగా డీఆర్‌డీఓ పర్యవేక్షించనున్నారు. ఇప్పటికే స్కూల్ విద్యార్థుల యూనిఫామ్ కుట్టే పనిలో మహిళా సంఘాలు బిజీగా ఉన్నాయి. ఇప్పుడు అంగన్‌వాడీల పని కూడా దొరకడంతో మరింత బిజీ కానున్నాయి. కుట్టు కూలి కింద బాలికల యూనిఫామ్ జతకు రూ.60, బాలురకు రూ.80 చొప్పున చెల్లించనున్నారు. గతంలో ప్రైవేట్ టైలర్లకు అప్పగిస్తే అధిక సమయం తీసుకోవడంతో మహిళా సంఘాలకే పని కల్పిస్తున్నారు.

అంగన్‌వాడీ కేంద్రాల బలోపేతానికి..

తెలంగాణ ఆవిర్భావం తర్వాత బడులు, అంగన్‌వాడీలు ఎంతో అభివృద్ధి చెందాయి. ప్రైవేట్ పాఠశాలలతో సమానంగా సదుపాయాలు కల్పిస్తున్నారు. సర్కారు బడుల్లో మంచి విద్య అందుతోంది. ఇక అంగన్‌వాడీ కేంద్రాలను సైతం బలోపేతం చేసేందుకు ఇప్పుడు యూనిఫామ్ సిస్టమ్ తీసుకొచ్చామని అధికారులు చెబుతున్నారు.

వచ్చే నెల నుంచి యూనిఫామ్ పంపిణీ..



అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారులకు యూనిఫామ్ కోసం జిల్లాకు నాలుగు రకాల క్లాత్ వచ్చింది. వీటిని మహిళా సంఘాల ద్వారా కుట్టించేందుకు చర్యలు చేపట్టాం. తొలుత ప్రభుత్వ పాఠశాలల ప్రాంగణంలో నడుస్తున్న 626 అంగన్‌వాడీల్లో అమలు చేస్తాం. వచ్చే నెల నుంచి యూనిఫామ్ పంపిణీ చేస్తాం. అంగన్‌వాడీలను బలోపేతం చేయడానికి రాష్ట్ర ప్రభుత్వం ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది.

– వేల్పుల విజేత, ఐసీడీఎస్ పీడీ

టమోత మోగుతోంది..



ఖమ్మంలోని రైతు బజార్‌లో విక్రయిస్తున్న టమాట

- రైతుబజార్లలో కిలో రూ.80కి చేరిన ధర
- బయటైతే రూ.100 పలుకుతున్న వైనం
- స్థానికంగా లభ్యత లేక ఇతర రాష్ట్రాల నుంచి దిగుమతి

ఖమ్మంవ్యవసాయం/నేలకొండపల్లి: టమాటా ధర ఆకాశాన్నంటుతోంది. స్థానికంగా ఉత్పత్తి లేక పోవటంతో ధరకు రెక్కలొచ్చాయి. నెల క్రితం రైతు బజార్లలో కిలో రూ. 25కు లభించిన టమాటా ప్రస్తుతం రూ.80 నుంచి రూ.100 వరకు పలుకుతోంది. ఖమ్మం హోల్‌సేల్ మార్కెట్‌కు నిత్యం 300 టన్నుల మేర టమాటాను ఇతర ప్రాంతాల నుంచి దిగుమతి చేసుకొని వ్యాపారులకు విక్రయిస్తారు. ప్రస్తుతం ఉత్పత్తి లేక వ్యాపారులు ఆర్డర్ చేసినా 100 టన్నులకు మించి రావడం లేదు. దీంతో కిలో ఒక్కింటికి రూ.65 నుంచి రూ.70 చొప్పున హోల్‌సేల్ వ్యాపారులు దిగుమతి చేసుకుంటున్నట్లు చెబుతుండగా.. అది రిటైల్ వ్యాపారులు, రైతు బజార్లు, గ్రామాలకు చేరే సరికి రూ.80 మొదలు రూ.100కు చేరుతోంది.

దిగుమతి.. ఎగుమతి

ఖమ్మం పరిసర మండలాలేక కాక భద్రాద్రి జిల్లాలో సాగు చేసిన టమాటాను ఖమ్మం నగరంలోని హోల్‌సేల్ మార్కెట్‌లో, రైతుబజార్లలో విక్రయించేవారు. ఏప్రిల్ వరకు స్థానికంగా పంట లభ్యత ఉన్నా యాసంగి సాగు కాలం పూర్తికావడంతో ఆతర్వాత ఉత్పత్తి నిలిచిపోయింది. దీంతో హోల్‌సేల్ వ్యాపారులు టమాటాను ఏపీలోని చిత్తూరు జిల్లా మదనపల్లి నుంచే కాక కర్ణాటక, మధ్యప్రదేశ్, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాల నుంచి దిగుమతి చేసుకొంటున్నారు. ఆయా ప్రాంతాల్లో షేడ్‌నెట్ల కింద టమాటా సాగు చేస్తుండగా ఇక్కడి వ్యాపారులు తెప్పించి ఖమ్మం, భద్రాద్రికొత్తగూడెం, మహబూబాబాద్, సూర్యాపేట జిల్లాలకు టమాటా సరఫరా చేస్తున్నారు. స్థానికంగా పంట లేకపోవటంతో టమాటా ధరకు రెక్కలొచ్చినట్లు చెబుతున్నారు. జనవరిలో కేజీ రూ.20 పలికిన టమాటా ధర ఫిబ్రవరిలో కూడా అలాగే కొనసాగగా మార్చి, ఏప్రిల్ నెలల్లో రూ.25, మే నెలలో రూ.30కి చేరింది. అనంతరం ఈనెల రెండో వారంలో రూ.50కి అంతకంతకు పెరుగుతూ ఇప్పుడు రూ.100కు చేరడంతో సామాన్య, మధ్య తరగతి వర్గాలు వెనకడుగు వేస్తున్నాయి.

క్లుప్తంగా

సింగరేణి ఆత్మను ఆవిష్కరించేలా పాట..

గాయకుడు, రచయిత మిట్టపల్లి సురేందర్


మాట్లాడుతున్న సురేందర్

కొత్తగూడెంటౌన్: బొగ్గు గని నుండి పుట్టుతున్న అగ్గిధారల్.. గనులెన్నో తవ్వుతున్న గడ్డపారల్.. సింగరేణి యువకుల్ అంటూ సాగే పాట సింగరేణి ఆత్మను ఆవిష్కరించేలా ఉంటుందని ప్రముఖ కవి, గాయకుకు మిట్టపల్లి సురేందర్ తెలిపారు. ఆయన సింగరేణిపై రాసిన పాట చిత్రీకరణలో పాల్గొనేందుకు కొరియోగ్రాఫర్లు, గాయకులు, నటీనటుల ఎంపిక కోసం కొత్తగూడెంలో శుక్రవారం ఆడిషన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లాకు చెందిన పలువురు యువతీ, యువకులు ప్రదర్శన ఇచ్చారు. అనంతరం సురేందర్ మాట్లాడుతూ ఇటీవల మిట్టపల్లి స్టూడియో నుండి విడుదలైన అమ్మపాడే జోల పాట ఘన విజయాన్ని సాధించిందని తెలిపారు. ఈనేపథ్యాన సింగరేణిపై రాసిన పాట సైతం అందరికీ గుర్తుండిపోతుందని ధీమా వ్యక్తం చేశారు. రచయిత, కొరియోగ్రాఫర్ కళ్యాణ్, సుమిత్రతో పాటు హనుమండ్ల మధు, రాయికం సంతోష్, గాజుల శ్రీనివాసరావు, మిట్టపల్లి స్టూడియో సీఈఓ పుల్ల సతీష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

నా భూమికి రక్షణ కల్పించాలి

మాజీ ఎమ్మెల్యే చందా లింగయ్య దొర


మాట్లాడుతున్న చందా లింగయ్య దొర

కరకగూడెం: తన భూమికి రక్షణ కల్పించాలని మాజీ ఎమ్మెల్యే, మాజీ జెడ్పీ చైర్మన్, ఆదివాసీ జాతీయ సంఘాల జేఏసీ అధ్యక్షుడు చందా లింగయ్య దొర కోరారు. మండల కేంద్రంలోని తన భూమిలోకి వెళ్లే రహదారిని ఓ వ్యక్తి ట్రాక్టర్ ద్వారా దున్ని, సరిహద్దుల ఫెన్సింగ్ స్తంభాలను ధ్వంసం చేశారని వాపోయాడు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఏజెన్సీలో ఆదివాసీల భూములకు రక్షణ లేకుండా పోయిందని ఆవేదన వ్యక్తం చేశాడు. 2003లో మండల కేంద్రానికి చెందిన ఓ గిరిజనేతర వ్యక్తి నుంచి 10 కుంటల భూమి కొని, తన భూమిలోకి రోడ్డు నిర్మించుకున్నట్లు తెలిపారు. అప్పటి నుంచి తమ స్వాధీనంలోనే ఉంటున్నా, ఓ వ్యక్తి రోడ్డును దున్ని, ఫెన్సింగ్ పోల్స్ ధ్వంసం చేశాడని ఆరోపించారు. సంబంధిత అధికారులు స్పందించి బాధ్యులపై, అతనికి సహకరించిన మరో వ్యక్తిపై అట్రాసిటీ, 1/70 చట్టాల ప్రకారం చర్యలు తీసుకోవాలని కోరారు. కాగా ఈ ఘటనపై ఫిర్యాదు అందిందని, పరిశీలిస్తున్నామని ఎస్‌ఐ రాజేందర్ తెలిపారు.

గిరిజనులు, అటవీశాఖ సిబ్బందికి మధ్య వాగ్వాదం

దుమ్ముగూడెం : మండలంలోని గౌరారం గ్రామ శివారులో అటవీశాఖ సిబ్బందికి, గిరిజనులకు మధ్య శుక్రవారం వాగ్వాదం నెలకొంది. అటవీశాఖ సిబ్బంది అటవీశాఖ భూముల్లో ట్రెంచ్ కొట్టేందుకు జేసీబీ వాహనం తీసుకుని వెళ్లారు. దీంతో గ్రామస్తులు అడ్డుకున్నారు. కొన్నేళ్లుగా సాగు చేసుకుంటున్న భూములను లాక్కుంటే తమ పరిస్థితి ఏంటని అటవీశాఖ సిబ్బందిని నిలదీశారు. ఈ క్రమంలో వాగ్వాదం నెలకొంది. రేంజర్ కనకమ్మ జోక్యం చేసుకుని పట్టాలు తీసుకువస్తే అటవీహక్కుల చట్టం కమిటీల సమక్షంలో సమస్యను పరిష్కరించుకుందామని సూచించడంతో గిరిజనులు వెనక్కి తగ్గారు.


చర్లలో..

చర్ల రూరల్: బట్టిగూడెం గ్రామస్తులు, న్యూడెమోక్రసీ నాయకులు సతీష్‌కు అటవీశాఖ అధికారులకు మధ్య శుక్రవారం స్వల్పంగా తోపులాట జరిగింది. ప్లాంటేషన్ వేసేందుకు సిద్ధంగా ఉన్న అటవీ భూమిలోకి రావడంతో తోపులాట జరిగిందని ఎఫ్ఆర్వో ఉపేంద్ర తెలిపారు.

నాటుసారా స్వాధీనం

దుమ్ముగూడెం : మండలంలోని నర్సాపురంలో అక్రమంగా నాటుసారా విక్రయిస్తున్న వ్యక్తిపై శుక్రవారం పోలీసులు కేసు నమోదు చేశారు. గోపయ్య అనే వ్యక్తి నర్సాపురం గ్రామానికి వచ్చి నాటుసారా విక్రయిస్తుండగా, మహిళలు పట్టుకునేందుకు ప్రయత్నించారు. దీంతో సారా ప్యాకెట్లను అక్కడే వదిలేసి పారిపోయాడు. మహిళల ఫిర్యాదు మేరకు గోపయ్యపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ గణేష్ తెలిపారు.

వ్యక్తి అదృశ్యం


వెంకటరమణ (ఫైల్)

పాల్వంచరూరల్: వ్యక్తి అదృశ్యంపై శుక్రవారం పోలీసులు కేసు నమోదు చేశారు. టౌన్ పోలీసుల కథనం ప్రకారం.. మండల పరిధిలోని యానంబైల్ గ్రామానికి చెందిన శిరసాని వెంకటరమణ పట్టణంలోని గట్టాయిగూడెంలో నివాసం ఉంటున్నారు. హైదరాబాద్‌లో పని ఉందంటూ ఈ నెల 17న సాయంత్రం 6 గంటలకు ఇంటి నుంచి బయటకు వెళ్లాడు. తిరిగి రాలేదు. కుటుంబ సభ్యులు ఫోన్ చేస్తే సెల్ ఫోన్ స్విచ్చాఫ్ వస్తోంది. బంధువుల వద్ద వెతికినా ఆచూకీ లేదు. వెంకటరమణ భార్య మీనాక్షి పోలీసులకు ఫిర్యాదు చేయగా, పట్టణ ఎస్‌ఐ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

అన్నదాతకు ‘మద్దతు’

- పలు పంటలకు కనీస మద్దతు ధర సవరించిన కేంద్రం
- వరిపై ఉన్న ధర రూ.117 పెంపు
- ఇప్పటికే రాష్ట్రం నుంచి రూ.500 బోనస్ ప్రకటన
- ఇంకొన్ని పంటలకు కూడా ధర పెంచిన కేంద్ర ప్రభుత్వం
- అయినా పెరిగిన పెట్టుబడులతో గిట్టుబాటు కాదంటున్న రైతాంగం



ఖమ్మంవ్యవసాయం: ఏటేటా పంటల సాగు పెట్టుబడి పెరుగుతోంది. అయినా కష్టనష్టాలకోర్చి సాగు చేస్తున్న పంటలకు మద్దతు ధర లభించక రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ నేపథ్యాన ఏటా మాదిరిగానే ఈసారి కూడా కేంద్ర ప్రభుత్వం పంటలకు కనీస మద్దతు ధరను ప్రకటించింది. దేశంలో పండించే 17 రకాల పంటలకు కనీస మద్దతు ధరలను సవరించగా.. ఇవి ప్రస్తుత వానాకాలం నుంచే అమల్లోకి రానున్నాయి. ఉమ్మడి ఖమ్మం జిల్లాలో సాగు చేసే ప్రధాన పంటలైన వరి, పత్తి, మొక్కజొన్నకు సైతం కేంద్రం పెంచిన కనీస మద్దతు ధరలు వర్తించనున్నాయి. ఇవికాక పెసర, మినుము, కంది, మినుము వంటి పంటలను కూడా రైతులు సాగు చేస్తుండగా మద్దతు ధర పెరిగింది.

వరికి అ‘ధనమే’..

ఖమ్మం జిల్లాలో 7 లక్షలకు పైగా ఎకరాల్లో, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో 5 లక్షల ఎకరాలకు పైగా రైతులు వివిధ రకాల పంటలను సాగుచేస్తున్నారు. ఇందులో ప్రధానంగా ఉమ్మడి జిల్లాలో 3.50 లక్షల ఎకరాలకు పైగా వరి సాగవుతోంది. గత ఏడాది వరి గ్రేడ్‌-ఏ రకం క్వింటాకు రూ.2,203గా, సాధారణ రకానికి రూ.2,183గా ధర నిర్ణయించారు. ఈ ఏడాది వీటిపై రూ.117 పెంచడంతో గ్రేడ్‌-ఏ వరి రకం ధర రూ.2,320కు, సాధారణ రకం రూ.2,300కు చేరింది. ఇక రాష్ట్ర ప్రభుత్వం అసెంబ్లీ ఎన్నికల సమయాన వరి క్వింటాకు రూ.500 బోనస్ ఇస్తామని ప్రకటించడంతో రాష్ట్ర రైతులకు అదనంగా ఇది వర్తించనుంది. అయితే, గత ఏడాది వర్షాభావ పరిస్థితుల నేపథ్యాన వరి సాగు విస్తీర్ణం తగ్గడంతో ధాన్యానికి డిమాండ్ పెరిగింది. దీంతో ప్రభుత్వ మద్దతు ధర కన్నా ప్రైవేట్ వ్యాపారులు రకాల ఆధారంగా రూ.500 నుంచి రూ.వెయ్యి వరకు చెల్లించారు.

పత్తి క్వింటాకు రూ.7,521

ఉమ్మడి జిల్లాలో రైతులు పత్తి దాదాపు 4 లక్షల ఎకరాల్లో సాగు చేస్తున్నారు. గత ఏడాది ఆశించిన ధర లేక ఈ ఏడాది పంట సాగు విస్తీర్ణం కొంత మేరకు తగ్గే అవకాశముందని వ్యవసాయ శాఖ అంచనా వేసింది. గత ఏడాది పత్తికి కేంద్రం తేమ శాతం ఆధారంగా రూ.7,020 గరిష్ట ధర ప్రకటించగా.. ఈ ఏడాది మరో రూ.521 పెంచడంతో రూ.7,521కి చేరింది. జిల్లాలో 2022–23 సంవత్సరంలో పత్తి క్వింటాకు రూ.13 వేల వరకు ధర పలికినా ఆ తర్వాత రూ.10 వేల వరకు పడిపోయింది. గత ఏడాది సీజన్‌లో నాణ్యమైన పత్తికి రూ.6 వేలకు మించి దక్కలేదు. దీంతో ప్రభుత్వం సీసీఐ (కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా) కేంద్రాలను ఏర్పాటు చేసినా రైతులకు ఆశించిన ప్రయోజనం కలగలేదు. దీనికి తోడు వర్షాభావ పరిస్థితుల్లో దిగుబడి లేక రైతులు నష్టపోయారు. ఈ నేపథ్యాన కేంద్రం క్వింటాకు రూ.501 ధర పెంచినా గిట్టుబాటు కాదని రైతులు చెబుతున్నారు.

పెరిగిన ఎరువుల ధరలు

ఎరువుల ధరలకు తోడు పురుగుమందుల ధరలు కూడా బాగా పెరిగాయి. కాంప్లెక్స్ ఎరువులు గతంలో రూ.1,300 ఉంటే ఇప్పుడు రూ.1,900కు చేరాయి. గతంలో రూ.900కు లభించిన పొటాష్ ధర రూ.1,650కు, డీఏపీ ధర రూ.1,350కు చేరింది. ఫలితంగా పంట సాగుకు పెట్టుబడులు పెరుగుతున్నాయి. ఎరువుల ధరలు, పెట్టుబడితో పోలిస్తే ప్రభుత్వం ప్రకటించే కనీస మద్దతు ధరలు గిట్టుబాటయ్యే పరిస్థితులు లేవని రైతులు పేర్కొంటున్నారు. ఇక కౌలు రైతుల పరిస్థితి మరీ దయనీయంగా మారుతోంది. భూమికి కౌలు చెల్లింపుతో పాటు, పెట్టుబడులు పెట్టాల్సి ఉండడంతో అంతగా మిగిలేదేమీ ఉండదని వారు వాపోతున్నారు.

పంటల వారీగా పెరిగిన మద్దతు ధర (రూ.ల్లో)

పంట	గత ఏడాది	ఈ ఏడాది	పెంపు
వరి గ్రేడ్‌-ఏ	2,203	2,320	117
సాధారణ రకం	2,183	2,300	117
పత్తి	7,020	7,521	501
మొక్కజొన్న	2,090	2,225	135
కందులు	7,000	7,550	550
పెసలు	8,558	8,682	124
మినుములు	6,950	7,400	450
వేరుశనగ	6,377	6,783	406

ఉమ్మడి ఖమ్మం జిల్లాలో పంటల సాగు విస్తీర్ణం అంచనా (ఎకరాల్లో)

పంట	ఖమ్మం జిల్లా	భద్రాద్రి కొత్తగూడెం
వరి	2,83,983	1,71,196
పత్తి	2,01,834	1,75,619
మొక్కజొన్న	40,000	60,254
పెసర	15,357	155
మినుము	436	205
వేరుశనగ	270	2,083
కంది	1,005	15,122

గిరిజన సంఘాన్ని బలోపేతం చేయాలి

వైరా: తండాలు, గూడేల వరకు గిరిజన సంఘాన్ని బలోపేతం చేసి గిరిజనుల సమస్యల పరిష్కారానికి పాటుపడాలని తెలంగాణ గిరిజన సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి భూక్యా వీరభద్రం పిలుపునిచ్చారు. వైరా శాంతినగర్‌లో నిర్వహిస్తున్న సంఘం రాష్ట్రస్థాయి రాజకీయ సామాజిక చైతన్య శిక్షణ తరగతులు శుక్రవారం రెండోరోజుకు చేరాయి. ఈ సందర్భంగా వీరభద్రం మాట్లాడుతూ.. గిరిజన సంఘం పోరాట ఫలితంగానే గత ప్రభుత్వం తండాలను పంచాయతీలుగా ప్రకటించిందని తెలిపారు. అలాగే, పోడు రైతులకు పట్టాలిచ్చేలా అటవీ హక్కు చట్టాన్ని రూపొందించడంలోనూ కీలక పాత్ర పోషించామని చెప్పారు. కాగా, ఎస్టీ సబ్‌ప్లాన్ నిధులతో తండాలను నేరుగా అభివృద్ధి చేయాలని, తండాల్లో ప్రభుత్వ పాఠశాలల్లో ఉపాధ్యాయ పోస్టులు భర్తీ చేయాలని, కర్ణాటక తరహాలో తండాల అభివృద్ధికి ప్రత్యేక బోర్డు ఏర్పాటు చేయాలని డిమాండ్‌చేశారు. ఈ సమస్యల పరిష్కారం కోసం కార్యకర్తలు సమరశీల పోరాటాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. సమావేశంలో సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రమావత్ శ్రీరామ్‌నాయక్, నాయకులు బానోత్ బాలాజీ, గుగులోత్ పంతునాయక్, భూక్యా బస్సీలాల్, శ్రీనివాస్‌నాయక్, కృష్ణనాయక్, వాంకుడోత్ అమర్‌సింగ్, బానోత్ హరిచంద్, అజ్మీరా శోభన్, మధు, జ్యోతి, విజయ, వెంకన్న, కిషన్, రాము తదితరులు పాల్గొన్నారు.

2.28 క్వింటాళ్ల గంజాయి స్వాధీనం


వివరాలు వెల్లడిస్తున్న ఎక్సైజ్ అధికారులు

దుమ్ముగూడెం : మండలంలోని లక్ష్మీనగరం స్టేట్ బ్యాంకు వద్ద ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు శుక్రవారం 2.28 క్వింటాళ్ల గంజాయిని పట్టుకున్నారు. ఎక్సైజ్ అధికారుల కథనం ప్రకారం.. ఎక్సైజ్ అసిస్టెంట్ కమిషనర్ గణేష్, అసిస్టెంట్ సూపరింటెండెంట్ తిరుపతి, ఇన్‌స్పెక్టర్ సీహెచ్ శ్రీనివాస్ తదితరులు భద్రాచలంలోని ఆర్టీఏ చెక్ పోస్టు వద్ద వాహన తనిఖీలు చేపట్టారు. ఈ క్రమంలో ఓ కారు ఆపకుండా వెళ్తుండగా వెంబడించారు. సమాచారం ఇవ్వడంతో అప్రమత్తమైన దుమ్ముగూడెం పోలీసులు లక్ష్మీనగరం బ్యాంక్ వద్ద రోడ్డుకు అడ్డంగా వాహనాలు నిలిపి ఉంచారు. దీంతో మరోదారి లేక కారు చిక్కుకుపోయింది. కారులో ఉన్న ముగ్గురిని అదుపులోకి తీసుకున్నారు. ఈలోపు భద్రాచలం నుంచి వచ్చిన ఎక్సైజ్ అధికారులు కారును తనిఖీ చేయగా, కారులో 2.28 క్వింటాళ్ల గంజాయి లభ్యమైంది. వాహనాన్ని, గంజాయిని స్వాధీనం చేసుకుని భద్రాచలం ఎక్సైజ్ కార్యాలయానికి తరలించారు. తమిళనాడు రాష్ట్రానికి చెందిన క్రిష్టఫర్, శివగురు, రకుల్ బోస్ సీలేరు నుంచి చెన్నైకు తరలిస్తున్నట్లు తేలింది. రెండు సెల్ ఫోన్లు, రూ.5,500 నగదు, శ్రీలంక, బంగ్లాదేశ్ కరెన్సీని స్వాధీనం చేసుకున్నారు. స్వాధీనం చేసుకున్న గంజాయి విలువ రూ.65 లక్షలు ఉంటుందని, నిందితులపై కేసు నమోదు చేశామని భద్రాచలం ఎక్సైజ్ సీఐ రహీమున్నీషా బేగం తెలిపారు. ఈ దాడిలో ఎక్సైజ్ సిబ్బంది బాలు, సుధీర్, హరీష్, హనుమంతరావు, విజయ్, వెంకట్ పాల్గొన్నారు.

మణుగూరులో మరో 14 కేజీలు..

మణుగూరు టౌన్: మణుగూరు మీదుగా మోటార్ సైకిల్‌పై హైదరాబాద్‌కు తరలిస్తున్న గంజాయిని శుక్రవారం పోలీసులు పట్టుకున్నారు. పోలీసుల కథనం ప్రకారం.. బైక్‌పై మణుగూరు మీదుగా హైదరాబాద్‌కు గంజాయి తీసుకెళ్తున్నారనే సమాచారం అందడంతో ఎస్‌ఐ మేడ ప్రసాద్ ఆధ్వర్యంలో రాజుపేట క్రాస్‌రోడ్డు వద్ద వాహనాల తనిఖీ చేపట్టారు. ఈ క్రమంలో ఒడిశాలోని మల్కన్‌గిరి జిల్లా చిత్రకొండ ప్రాంతానికి చెందిన గురుకిల, పోడు వంతల్ అదే ప్రాంతానికి చెందిన రాహుల్ కుమార్ సూచన మేరకు మోటార్‌సైకిల్‌పై హైదరాబాద్‌కు గంజాయి తరలిస్తుండగా పట్టుకున్నారు. వారి నుంచి రూ.3.40లక్షల విలువైన 14 కేజీల గంజాయి స్వాధీనం చేసుకున్నారు. రాహుల్ పరారీలో ఉన్నాడని, ఇద్దరు నిందితులపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించామని ఎస్‌ఐ తెలిపారు.

భద్రాచలంలో..

భద్రాచలంఅర్బన్: అక్రమంగా కారులో గంజాయిని తరలిస్తుండగా శుక్రవారం ఎక్సైజ్ అధికారులు పట్టుకున్నారు. పోలీసుల నుంచి తప్పించుకుని పారిపోతున్న క్రమంలో భద్రాచలం ఏరియా ఆస్పత్రి స్మగ్లర్లను అదుపులోకి తీసుకున్నారు. కాగా ఇందుకు సంబంధించిన పూర్తి వివరాలు ఎక్సైజ్ పోలీసులు అధికారికంగా వెల్లడించాల్సి ఉంది.

మావోయిస్టుల డంప్ స్వాధీనం

చర్ల: ఏఓబీ సరిహద్దు ప్రాంతంలోని మల్కనగిరి జిల్లాలో శుక్రవారం పోలీసు బలగాలు మావోయిస్టుల డంప్‌ను గుర్తించాయి. ఒడిశా రాష్ట్రంలోని మల్కనగిరి జిల్లా కలిమెల పోలీస్ స్టేషన్ పరిధిలోని దూలగండి సమీప అటవీ ప్రాంతంలో పోలీసు బలగాలు డంప్‌ను గుర్తించాయి. బెజ్జంకివాడ రిజర్వ్ ఫారెస్టులో కూంబింగ్ ఆపరేషన్ కొనసాగిస్తున్న బీఎస్ఎఫ్ 142 బెటాలియన్, స్పెషల్ ఫోర్స్‌కు చెందిన భద్రతా బలగాలు గుర్తించిన ఈ భారీ డంప్‌లో 3 ఎస్‌బీఎంఎల్ తుపాకులు, 1 ఎస్‌బీఎంఎల్ బ్యారల్, 4 ఎలక్ట్రిక్ డిటోనేటర్లు, 98 జిలిటెన్ స్టిక్స్, 2 డైవర్షనల్ మైన్స్, 1 సోలార్ ప్యానల్, 1 ట్వల్వ్ ఓల్ట్స్ కెపాసిటీ గల బ్యాటరీ, 3 ఎల్‌పీజీ గ్యాస్ సిలిండర్లు, 3 మేల్ ఫీమెల్ ఎలక్ట్రిక్ స్విచ్‌లు, 10 సెలైన్ బాటిళ్లు, 12 చిన్న మెడికల్ బాక్సులను స్వాధీనం చేసుకున్నారు. ఈ ప్రాంతంలోని గ్రామాల్లో మావోయిస్టులకు మంచి పట్టు ఉండడంతో పాటు, పార్టీకి సానుభూతిపరులు కూడా ఎక్కువగా ఉన్నట్లు ఒడిశా పోలీసులు చెబుతున్నారు. ఈ ప్రాంతంలో మరిన్ని డంప్‌లు లభ్యమయ్యే అవకాశం ఉండడంతో కూబింగ్ ముమ్మరం చేయడంతో పాటు ప్రత్యేకంగా తనిఖీలు చేపడుతున్నట్లు అక్కడి పోలీస్ ఉన్నతాధికారులు తెలిపారు.

కలప అక్రమ రవాణాపై విచారణ

గుండాల: మండలంలోని కాచనపల్లి రేంజ్ పరిధిలోని పెద్దతోగు బీట్ నుంచి కలప అక్రమ రవాణా ఘటనపై అటవీశాఖ టాస్క్‌ఫోర్స్ ఎఫ్ఆర్ఓ ప్రసాద్ శుక్రవారం విచారణ నిర్వహించారు. రెండు రోజులుగా పెద్దతోగు బీట్ పరిధిలో పర్యటించిన ఆయన పోడు భూముల్లో టేకు మొట్లను పరిశీలించి కొలతలు వేశారు. కలప రవాణాకు సంబంధించి పోడు రైతులను విచారించారు. అటవీశాఖ సిబ్బందితో మాట్లాడి రవాణాకు సంబంధించిన వివరాలు అడిగి తెలుసుకున్నారు. విచారణ చేపట్టామని, పూర్తిస్థాయి నివేదికను ఉన్నతాధికారులకు అందజేస్తామని ఎఫ్ఆర్ఓ తెలిపారు.

రైలు ఎక్కబోయి జారిపడి..

టీవీ షో స్క్రిప్ట్ రైటర్ మృతి


మహ్మదీన్ (ఫైల్)

కొత్తగూడెంఅర్బన్: కొత్తగూడెం నుంచి హైదరాబాద్ వెళ్లేందుకు శుక్రవారం రైలు ఎక్కుతూ కాలుజారి కింద పడి టీవీ షో స్క్రిప్ట్ రైటర్, సహాయ నటుడు మృతి చెందాడు. ఆర్పీఎఫ్, రైల్వే ప్రయాణికుల కథనం ప్రకారం.. చుంచుపల్లి మండలంలోని హౌసింగ్ బోర్డు కాలనీకి చెందిన మేదర మహ్మదీన్ హైదరాబాద్ వెళ్లేందుకు తెల్లవారుజామున భద్రాచలం రోడ్డు రైల్వే స్టేషన్‌కు వచ్చాడు. కాకతీయ ఎక్స్‌ప్రెస్ రైలు ఎక్కుతుండగా కాలు జారి ప్లాట్‌ఫాంకు, రైలుకు మధ్య ఇరుక్కుపోయాడు. అప్పటికే రైలు కదులుతుండగా ప్లాట్‌ఫాం, రైలు మధ్య శరీరం మూడు, నాలుగు సార్లు తిరిగింది. గమనించిన ఆర్పీఎఫ్ పోలీసులు అతని చేతులు పట్టుకుని పైకి లాగారు. దీంతో మహ్మదీన్ పైకి లేచి నడుచుకుంటూ తనకు ఏమి కాలేదని పేర్కొన్నాడు. అయినా ఆర్పీఎఫ్ పోలీసులు 108 వాహనంలో కొత్తగూడెం జిల్లా ఆస్పత్రికి తరలించారు. అక్కడి వైద్యుల సూచన మేరకు ఖమ్మం తరలిస్తుండగా మృతి చెందాడు. కాగా మహ్మదీన్ ప్లాట్‌ఫాం, రైలుకు మధ్య నలిగిపోయి అతని శరీరంలోని అవయవాలు దెబ్బతిన్నాయని వైద్యులు నిర్ధారించారు. శరీరంపై మాత్రం నామమాత్రపు గాయాలే ఉన్నాయి. ప్లాట్‌ఫాం నుంచి 108 వాహనం వరకు, ఆస్పత్రిలో కూడా నడుచుకుంటూ తిరిగిన వ్యక్తి మృతి చెందడం విస్మయానికి గురిచేసింది. మృతుడికి భార్య, ఇద్దరు కూతుళ్లు ఉన్నారు. ఈ ఘటనపై ఆర్పీఎఫ్ పోలీసులు కేసు నమోదు చేశారు.

విద్యుత్ స్తంభాన్ని ఢీకొట్టిన లారీ

తెగిపడిన విద్యుత్ వైర్లు


విద్యుత్ స్తంభంపై నుంచి దూసుకెళ్లిన లారీ

కొత్తగూడెంఅర్బన్(పాల్వంచ): భద్రాచలం ప్రధాన రహదారిపై లారీ విద్యుత్ స్తంభాన్ని ఢీ కొట్టి రోడ్డు పక్కకు దూసుకుపోయింది. స్థానికుల కథనం ప్రకారం.. కొత్తగూడెం వైపు వెళుతున్న సున్నం లోడ్ లారీ స్టీరింగ్ స్ట్రక్ అవడంతో ఒక్కసారిగా రోడ్డు పక్కకు దూసుకుపోయింది. దీంతో విద్యుత్ స్తంభాన్ని ఢీకొట్టి ఫుట్‌పాత్‌పై ఎక్కింది. ఈ క్రమంలో విద్యుత్ ధ్వంసమై వైర్లు తెగిపడ్డాయి. ఈ ఘటనలో విద్యుత్ శాఖకు సుమారు రూ.70 వేల నష్టం వాటిల్లిందని సిబ్బంది తెలిపారు. కాగా లారీ సైతం కట్టర్లు విరిగి ధ్వంసమైంది. ఎన్‌పీడీసీఎల్ సిబ్బంది విద్యుత్ వైర్ల మరమ్మతులు చేపట్టారు.

విద్యుదాఘాతంతో రెండు ఆవులు మృతి


మృతి చెందిన ఆవులు

అన్నపురెడ్డిపల్లి: విద్యుదాఘాతంతో శుక్రవారం రెండు ఆవులు మృతి చెందాయి. అన్నపురెడ్డిపల్లి గ్రామానికి చెందిన కల్లోజి కృష్ణయ్యకు చెందిన ఆవులు మేతకు వెళ్లాయి. ట్రాన్స్‌ఫార్మర్ పక్కన ఉన్న నీటి కుంట వద్ద ఆవులు నీరు తాగుతున్న క్రమంలో విద్యుదాఘాతానికి గురై మృతి చెందాయి. సుమారు రూ. 80 వేల నష్టం జరిగిందని బాధిత రైతు తెలిపాడు.

కేటీపీఎస్ తుక్కుపై విచారణ జరిపించాలి

ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు


కేటీపీఎస్ అధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కూనంనేని

కొత్తగూడెంఅర్బన్(పాల్వంచ): కాలం చెల్లిన కేటీపీఎస్ పాత ప్లాంట్(ఒఅండ్ఎం) నుంచి తుక్కు తరలింపుపై అనేక అవినీతి ఆరోపణలు వస్తున్నాయని, మరోసారి విచారణ చేపట్టాలని కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు డిమాండ్ చేశారు. శుక్రవారం ఆయన పాత ప్లాంట్‌ను సందర్శించి అధికారులతో మాట్లాడారు. అనంతరం మాట్లాడుతూ తుక్కు తరలింపు ద్వారా ప్రభుత్వానికి రూ.2 వేల కోట్ల ఆదాయం రావాల్సి ఉండగా, రూ.484 కోట్లకే టెండర్లు కట్టబెట్టారనే ఆరోపణలు వస్తున్నాయని పేర్కొన్నారు. ఇప్పటివరకు నిర్వహించిన జెన్‌కో విజిలెన్స్ విచారణ కాకుండా ఇండిపెండెంట్ కమిటీ ద్వారా విచారణ చేపట్టాలన్నారు. అప్పటి వరకు తరలింపు పనులను నిలుపుదల చేయాలన్నారు. కాంప్లెక్స్‌లో మరో ప్లాంట్ ఏర్పాటుకు తాను ప్రయత్నిస్తున్నానని తెలిపారు. ఈ కార్యక్రమంలో సీఈ పి.వెంకటేశ్వరరావు, అధికారులు కిరణ్‌కుమార్, తహసీల్దార్ వివేక్, మున్సిపల్ కమిషనర్ ఎ.స్వామి, సీపీఐ జిల్లా కార్యదర్శి ఎస్కె.సాబీర్ పాషా, ముత్యాల విశ్వనాథం, పూర్ణచందర్ రావు, సాయిబాబు, డి.సుధాకర్, ఉప్పుశెట్టి రాహుల్, మురళి, కిరణ్, అన్నారపు వెంకటేశ్వర్లు, శేఖర్, గిరి, విజయ్, జకరయ్య తదితరులు పాల్గొన్నారు.

సింగరేణి ఆస్పత్రిలో తనిఖీ

కొత్తగూడెం అర్బన్(సింగరేణి): కొత్తగూడెంలోని సింగరేణి మెయిన్ ఆస్పత్రిని శుక్రవారం రాత్రి ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు తనిఖీ చేశారు.ఈ సందర్భంగా సీఎంఓ సుజాతతో సమావేశమై కార్మికులకు అందుతున్న వైద్యం, డైట్ తదితర అంశాలపై చర్చించారు. అలాగే, పరికరాలు, ఇతర అంశాలపై ఆరా తీసిన ఎమ్మెల్యే పలు సూచనలు చేశారు. ఐఎన్‌టీయూసీ అధ్యక్షుడు వాసిరెడ్డి సీతారామయ్య, నాయకుడు వంగా వెంకట్ తదితరులు పాల్గొన్నారు.

రూ.79 లక్షలు పలికిన ఆశీలు టెండర్


వేలంపాటలో పాల్గొన్న టెండర్‌దారులు

భద్రాచలంఅర్బన్: భద్రాచలం గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో ఆశీలు (పార్కింగ్), సంత, గోదావరి ఫెర్రీ, పంచాయతీ దుకాణాలకు శుక్రవారం వేలంపాట నిర్వహించారు. డీఎల్‌పీఓ సుధీర్, గ్రామ పంచాయతీ అధికారి శ్రీనివాస్ సమక్షంలో వేలంపాట నిర్వహించగా, ఆశీలును రూ.79 లక్షలకు రాములు అనే కాంట్రాక్టర్ దక్కించుకున్నాడు. గతేడాది ఇదే కాంట్రాక్టర్ రూ.54.90 లక్షలకు వేలం పాట పాడుకున్నాడు. గతేడాది టెండర్లు మార్చితోనే ముగియగా, పార్లమెంట్ ఎన్నికల కోడ్ నేపథ్యంలో మూడు నెలల గడువు పొడిగించారు. అందుకు టెండర్‌పై 40 శాతం పెంచి ఆశీలుకు రూ.19.40 లక్షలు, ఫెర్రీ రూ.6.25 లక్షలు, వారపు సంత రూ.35 వేలు, మూడు దుకాణాలకు రూ.85 వేలు గ్రామ పంచాయతీ అధికారులు వసూలు చేశారు. గోదావరి నదిలో ఉండే బోట్లు (ఫెర్రీ) గత ఏడాది రూ.18 లక్షల 75 వేలు పలకగా, ఈసారి రూ.16.90 లక్షలు పలికింది. చర్ల రోడ్డులో నిర్వహించే వారపు సంత గతేడాది రూ.1.76 వేలు పలకగా, ఈ ఏడాది రూ.3.90 లక్షలకు దక్కించుకున్నారు. మూడు దుకాణాలు రూ. 3 లక్షలు పలికాయి. ఈ ఏడాది 9 నెలలకు టెండర్ నిర్వహించగా రూ.1.2 కోట్ల ఆదాయం సమకూరింది.

ఎన్‌టీఏను రద్దు చేయాల్సిందే...

నిరసన ప్రదర్శనలో విద్యార్థి, యువజన సంఘాల నాయకులు


నిరసన ర్యాలీలో పాల్గొన్న సంఘాల నాయకులు

ఖమ్మంమయూరిసెంటర్: నీట్ పేపర్ లీకేజీపై సుప్రీంకోర్టు జడ్జితో విచారణ జరిపించి బాధ్యులను శిక్షించడమేకాక ఎన్‌టీఏ సంస్థను తక్షణమే రద్దు చేయాలని విద్యార్థి, యువజన సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. ఈ అంశంపై ఎస్ఎఫ్ఐ, డీవైఎఫ్, ఏఐఎస్ఎఫ్, యూత్ కాంగ్రెస్, ఏఐవైఎఫ్, పీడీఎస్‌యూ, పీవైఎల్, పీడీఎస్‌యూ, ఎన్ఎస్‌యూ సంఘాల జిల్లా కార్యదర్శులు తుడుం ప్రవీణ్, బషీరుద్దీన్, ఇటికాల రామకృష్ణ, యడ్లపల్లి సంతోష్, నానబాల రామకృష్ణ, వి.వెంకటేశ్, ఎస్పీ రాకేశ్, మస్తాన్, రమేశ్, ఆసిఫ్ ఆధ్వర్యాన శుక్రవారం ఖమ్మంలోని ఎస్ఆర్అండ్‌బీజీఎన్ఆర్ డిగ్రీ కళాశాల నుంచి జెడ్పీసెంటర్ వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం నాయకులు మాట్లాడుతూ.. దేశవ్యాప్తంగా నీట్ పేపర్ లీకేజీపై విద్యార్థులు, తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నా ప్రధాని, కేంద్ర మంత్రులు స్పందించకపోవడం సరికాదన్నారు. ఇకనైనా సమగ్ర విచారణ జరిపించి విద్యార్థులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. నాయకులు చింతల రమేశ్, మంద సురేశ్, దాశోజు శ్రావణ్, మడుపల్లి లక్ష్మణ్, పొనుకుల సుధాకర్, లక్ష్మణ్, ఉమాశంకర్, క్రాంతి, సంగీత, బొల్లం మహేశ్, ఉదయ్‌కిరణ్, గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

మద్యం మత్తులోనే బడికి...

టీచర్‌ను పశువుల పాకలో పడుకోబెట్టిన స్థానికులు


పశువుల పాకలో పడుకున్న టీచర్ వీరయ్య

ములకలపల్లి: పిల్లలకు విద్యాబుద్ధులు నేర్పాలిన ఉపాధ్యాయుడు దారి తప్పాడు. ఎవరు ఏం అనుకుంటారోనన్న కనీస ఆలోచన లేకుండా మద్యం మత్తులోనే పాఠశాలకు రావడంతో ఆగ్రహించిన తల్లిదండ్రులు ఆయనను తీసుకెళ్లి పశువుల పాకలో పడుకోబెట్టారు. మండలంలోని తిమ్మంపేట గ్రామ పంచాయతీ పరిధి రాజీవ్‌నగర్ కాలనీ ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయుడు పత్తిపాటి వీరయ్య శుక్రవారం మద్యం మత్తులో విధులకు హాజరయ్యాడు. పాఠశాలలో 40 మంది విద్యార్థులు ఉండగా ఇద్దరు ఉపాధ్యాయులు పని చేస్తున్నారు. ఇందులో వీరయ్య అతిగా మద్యం సేవించి తూలుతూ పాఠశాలకు రాగా.. విద్యార్థులు ద్వారా విషయం తెలుసుకున్న తల్లిదండ్రులు, గ్రామస్తులు చేరుకుని ఆయనను మోసుకెళ్లి సమీపంలోని పశువుల కొట్టంలో పడుకోబెట్టారు. మధ్యాహ్నం 2.30 గంటల వరకు అక్కడే ఉన్న వీరయ్య.. ఆ తర్వాత లేచి వెళ్లిపోయాడు. ఈ విషయమై ఇన్‌చార్జ్ ఎంఈఓ శ్రీరామ్మూర్తి మాట్లాడుతూ ఉపాధ్యాయుడికి షోకాజ్ నోటీస్ జారీ చేయనున్నట్లు తెలిపారు.

వ్యక్తి ఆత్మహత్య

మణుగూరుటౌన్: వ్యక్తి ఆత్మహత్య ఘటనలో శుక్రవారం పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసుల కథనం ప్రకారం.. పట్టణంలోని శివలింగాపురానికి చెందిన తాళ్లూరి సాయి(27) కుటుంబ కలహాల నేపథ్యంలో క్షణికావేశంలో పురుగుల మందు తాగాడు. గమనించిన కుటుంబ సభ్యులు మణుగూరు ప్రభుత్వ ఆస్పత్రికి, అక్కడి నుంచి భద్రాచలం ఏరియా ఆస్పత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు ధ్రువీకరించారు. మృతుడికి భార్య, కుమారుడు ఉన్నారు.





శుక్రవారం ఏపీ అసెంబ్లీలో ఎమ్మెల్యేలుగా ప్రమాణం చేస్తున్న సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్, మాజీ సీఎం వైఎస్ జగన్

కొలువుదీరిన ఏపీ కొత్త శాసనసభ

- సీఎం సహా మంత్రులు, ఎమ్మెల్యేల ప్రమాణ స్వీకారం
- తొలి రోజే ప్రతిపక్ష నేత వైఎస్ జగన్‌ను అగౌరవపర్చిన ప్రభుత్వం
- సీఎం తర్వాత విపక్ష నేత ప్రమాణ స్వీకారం చేయడం సభ సంప్రదాయం
- ఆ సంప్రదాయాన్ని కాదని మంత్రుల తర్వాత విపక్ష నేత జగన్‌కు అవకాశం
- 2019లోబాబుకు సముచిత గౌరవం కల్పించిన వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం

సాక్షి, అమరావతి: ఆంధ్రప్రదేశ్‌లో కొత్త శాసన సభ కొలువుదీరింది. 16వ శాసన సభ సమావేశాలు శుక్రవారం ఉదయం 9:46 గంటలకు ప్రారంభం అయ్యాయి. రెండు రోజులపాటు జరిగే ఈ సమావేశాల్లో తొలి రోజు శాసన సభ్యుల ప్రమాణ స్వీకారం జరిగింది. శనివారం అసెంబ్లీ స్పీకర్ ఎన్నిక జరుగుతుంది. తొలిరోజే ప్రభుత్వం సభా సంప్రదాయాలను తుంగలో తొక్కింది. ప్రతిపక్ష నేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిని అగౌరవపర్చింది. వాస్తవంగా ముఖ్యమంత్రి ప్రమాణ స్వీకారం చేసిన తర్వాత ప్రతిపక్ష నేతకు అవకాశం కల్పించాలి. ఆ తర్వాత ఉప ముఖ్యమంత్రి, మంత్రులు, ఇతర ఎమ్మెల్యేలు ప్రమాణ స్వీకారం చేయాలి. అయితే, ప్రతిపక్ష నేతకు సముచిత గౌరవం ఇవ్వకుండా మంత్రులందరూ ప్రమాణం చేసిన తర్వాత చివర్లో ప్రమాణం చేయించింది. తద్వారా మున్ముందు ప్రతిపక్షం పట్ల తన వైఖరి ఏ విధంగా ఉండబోతోందో మొదటిరోజే స్పష్టంగా తెలియజెప్పింది. సీట్ల సంఖ్య ఎలా ఉన్నా 40 శాతం ఓట్లతో అత్యంత బలమైన పార్టీగా వైఎస్సార్‌సీపీ ఉంది. ఆ పార్టీకి ఉన్న ప్రజా బలాన్ని కూడా ప్రభుత్వం విస్మరించింది. 2019లో కొత్త అసెంబ్లీ కొలువుదీరినప్పుడు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అప్పటి విపక్ష నేత చంద్రబాబును సముచితంగా గౌరవించింది. అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్ తర్వాత ప్రతిపక్ష నేతగా ఉన్న చంద్రబాబుతో ప్రమాణం చేయించింది. ఆ తర్వాతే ఉప ముఖ్యమంత్రులు, మంత్రులు, మిగిలిన సభ్యులు ప్రమాణం చేశారు. ప్రతిపక్ష నేతకు గౌరవం ఇవ్వాలనే సదుద్దేశంతో అప్పట్లో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం చంద్రబాబు చేత సీఎం తర్వాత ప్రమాణం చేయించి గౌరవించింది. ఇప్పుడు ప్రతిపక్ష హోదా లేదనే సాకుతో టీడీపీ ప్రభుత్వం మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌ను మంత్రులందరి తర్వాత ప్రమాణం చేయించి సభా సంప్రదాయాలను కాలరాసింది. నిజానికి ప్రతిపక్ష హోదాకు 10 శాతం సభ్యులు ఉండాలనే నిబంధనం ఏ చట్టంలోనూ లేదని రాజకీయ విశ్లేషకులు చెబుతున్నారు. లోక్‌సభ తొలి స్పీకర్ మావలంకర్ సభలో ఇచ్చిన రూలింగ్‌ను కొన్ని రాజకీయ పార్టీలు అవసరార్థం వాడుకుంటున్నాయి. కానీ చాలా రాష్ట్రాలలో అధికారపార్టీలు మాజీ ముఖ్యమంత్రులకు, ప్రతిపక్ష నేతలకు సముచిత గౌరవం ఇస్తూ సత్సాంప్రదాయాలను పాటిస్తున్నాయి. టీడీపీ ప్రభుత్వం అలాంటి వాటిని తుంగలో తొక్కింది. 2019లో టీడీపీకి వచ్చిన ఎమ్మెల్యే సీట్లు 23 మాత్రమే. అప్పట్లో ఆ పార్టీకి ఇప్పుడు వైఎస్సార్‌సీపీకి వచ్చిన ఓట్లకన్నా తక్కువ ఓట్లే వచ్చాయి. గెలిచిన 23 మంది సభ్యుల్లోనూ ఐదుగురు టీడీపీని వీడి బయటకు వెళ్లిపోయారు. మిగిలిన కొద్ది మందిలో ఇంకొందరు ఆ పార్టీని వీడేలా చేసి, చంద్రబాబుకు ప్రతిపక్ష హోదా లేకుండా చేయాలనుకుంటే అప్పటి ప్రభుత్వానికి పెద్ద కష్టం కాదు. కానీ, వైఎస్సార్‌సీపీ ప్రభుత్వానికి ఆ ఆలోచన లేకపోవడంతో టీడీపీ సభ్యుల జోలికి వెళ్లకుండా చంద్రబాబుకు అప్పటి ప్రభుత్వం ప్రతిపక్ష నేత గౌరవం ఇచ్చింది. కానీ ఇప్పుడు అందుకు విరుద్ధంగా సభా సాంప్రదాయాలను పక్కనపెట్టి మాజీ ముఖ్యమంత్రిని అవమానపరిచేలా వ్యవహరించిందనే విమర్శలు వినిపిస్తున్నాయి.

అక్షరక్రమంలో సభ్యుల ప్రమాణం

శాసన సభ ప్రొటెం స్పీకర్‌గా నియమితులైన రాజమండ్రి రూరల్ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్య చౌదరి కొత్తగా ఎన్నికైన ఎమ్మెల్యేలతో శుక్రవారం ప్రమాణ స్వీకారం చేయించారు. తొలుత సీఎం చంద్రబాబునాయుడు, తర్వాత డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్, ఆ తర్వాత మంత్రులు అక్షర క్రమంలో ప్రమాణ స్వీకారం చేశారు. అనంతరం మాజీ ముఖ్యమంత్రి, వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ప్రమాణం చేశారు. ప్రమాణ స్వీకారం అనంతరం సభలోని సభ్యులందరికీ వైఎస్ జగన్ అభివాదం చేశారు. ఆ తర్వాత మహిళా ఎమ్మెల్యేలతో, అనంతరం అక్షర క్రమంలో మిగిలిన ఎమ్మెల్యేలందరితో ప్రొటెం స్పీకర్ ప్రమాణం చేయించారు. మాజీ సీఎం వైఎస్ జగన్ సహా వైఎస్సార్‌సీపీ నుంచి గెలిచిన 11 మంది, జనసేనకు చెందిన 21 మంది, బీజేపీకి చెందిన 8 మంది, టీడీపీకి చెందిన 131 మంది ఎమ్మెల్యేలు మొత్తం 171 మంది ప్రమాణ స్వీకారం చేశారు. మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి సహా ఏడుగురు సభ్యులు ఆంగ్లంలో, మిగిలిన వారందరూ తెలుగులో ప్రమాణం చేశారు. టీడీపీకి చెందిన ఆచంట ఎమ్మెల్యే పితాని సత్యనారాయణ, వినుకొండ ఎమ్మెల్యే జి.వి.ఆంజనేయులు, కాకినాడ ఎమ్మెల్యే వి. వెంకటేశ్వరరావు (కొండబాబు) వ్యక్తిగత కారణాలతో ప్రమాణస్వీకారం చేయలేదు. వీరితో ప్రొటెం స్పీకర్ శనివారం ప్రమాణం చేయిస్తారని తెలిసింది. తొలి రోజు శాసన సభ సమావేశం మొత్తం ప్రమాణ స్వీకారాలతోనే నడిచింది.

సీబీఐ దృష్టిలో దస్తగిరి ఓ వీఐపీ

వైఎస్ వివేకా హత్య కేసులో ఎంపీ అవినాశ్ న్యాయవాది వాదనలు

సాక్షి, హైదరాబాద్ : మాజీ మంత్రి వైఎస్ వివేకానందరెడ్డి హత్య కేసులో కిరాయి హంతకుడు దస్తగిరి (ఏ4)ని కేంద్ర దర్యాప్తు సంస్థ (సీబీఐ) ఓ నిందితుడిగా కాకుండా వీఐపీలా చూసిందని ఎంపీ అవినాశ్‌రెడ్డి తరఫు న్యాయవాది తెలిపారు. ఇలాంటి దర్యాప్తు సంస్థను ఎన్నడూ చూడలేదని చెప్పారు. హత్య కేసులో అప్రూవర్‌గా మారినందున తనను నిందితుల జాబితా నుంచి తొలగించి సాక్షిగా పరిగణించాలని కోరుతూ దస్తగిరి హైదరాబాద్‌లోని సీబీఐ కోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్‌పై న్యాయమూర్తి రఘురాం శుక్రవారం వాదనలు చేపట్టారు. సీబీఐ తరఫున అనిల్ తల్వార్ వాదనలు వినిపించారు. కోర్టు అనుమతిస్తే దస్తగిరిని నిందితుల జాబితా నుంచి తొలగించి, సాక్షుల జాబితాలో చేర్చడానికి తమకు అభ్యంతరం లేదన్నారు. అనంతరం అవినాశ్ తరఫు న్యాయవాది ఉమామహేశ్వర్‌రావు వాదనలు వినిపిస్తూ.. ఓ కరుడుగట్టిన హంతకుడు అప్రూవర్‌గా మారినంత మాత్రాన సాక్షిగా పేర్కొనడం ఎంత మాత్రం సమర్థనీయం కాదన్నారు. ఇలాగైతే ఇకపై హత్యలు చేసిన వారంతా అప్రూవర్‌గా మారి శిక్ష లేకుండా బయటకొస్తారని చెప్పారు. ఇది సమాజానికి తప్పుడు సంకేతాలు ఇచ్చినట్లు అవుతుందన్నారు. ఈ దశలో దస్తగిరి న్యాయవాది కల్పించుకొని వీఐపీ అనడంపట్ల అభ్యంతరం వ్యక్తం చేశారు. ముమ్మాటికీ దస్తగిరిని సీబీఐ ఓ వీఐపీలానే చూసిందని ఉమామహేశ్వర్‌రావు పునరుద్ఘాటించారు. నిందితుల న్యాయవాదుల వాదనల సందర్భంగా సీబీఐ న్యాయవాది కలుగజేసుకోవడంపై వారు తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. సీబీఐ వాదించేటప్పుడు తాము జోక్యం చేసుకోలేదన్నారు. తదుపరి విచారణను న్యాయమూర్తి జూలై 5కు వాయిదా వేశారు. న్యాయవాదులు సాయివంశీ, రవీందర్‌రెడ్డి, టీఎల్ నయన్‌కుమార్‌రెడ్డి పలువురు నిందితుల తరఫున వాదించారు.

ఆర్టీసీ ఖాతాలను పునరుద్ధరించండి

పీఎఫ్ అధికారులకు హైకోర్టు ఆదేశం



సాక్షి, హైదరాబాద్: ప్రావిడెంట్ ఫండ్ బకాయిలు చెల్లించడం లేదంటూ స్తంభింపజేసిన టీజీఎస్ ఆర్టీసీ బ్యాంక్ ఖాతాలను వెంటనే పునరుద్ధరించాలని అధికారులను హైకోర్టు ఆదేశించింది. దీనిపై కౌంటర్ దాఖలు చేయాలని ప్రతివాదులకు స్పష్టం చేసి తదుపరి విచారణను జూలై 15కు వాయిదా వేసింది. రూ.940 కోట్ల పీఎఫ్ బకాయిలు పేరుకుపోవడంతో టీజీఎస్ ఆర్టీసీకి చెందిన బ్యాంక్ ఖాతాలను పీఎఫ్ అధికారులు స్తంభింపజేయడం తెలిసిందే. ఈ కారణంగా ఆర్టీసీ రోజువారీ కార్యకలాపాలకు నగదు లేక తీవ్ర ఇబ్బంది పడాల్సి వస్తోందంటూ రవాణా అధికారులు హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. పిటిషన్‌పై సీవీ భాస్కర్ రెడ్డి విచారణ చేపట్టారు. టీజీఎస్ ఆర్టీసీ తరఫున అడ్వొకేట్ జనరల్ సుదర్శన్‌రెడ్డి వాదనలు వినిపిస్తూ.. ఉమ్మడి రాష్ట్రం ఉన్నప్పటి నుంచి పీఎఫ్ బకాయిలున్నాయని స్పష్టం చేశారు. విభజన చట్టాన్ని పరిగణనలోకి తీసుకోకుండా పీఎఫ్ అధికారులు ఒక్క టీజీఎస్ ఆర్టీసీ ఖాతాలను స్తంభింపజేయడం సరికాదన్నారు. ఆర్టీసీ విభజన జరిగినా.. ఈపీఎఫ్ విభజన జరగలేదని వివరించారు. ఇంకా ఏపీఎస్ ఆర్టీసీ పేరుపైనే పీఎఫ్ ఖాతాలున్నాయని వెల్లడించారు. పీఎఫ్ బకాయిలపై ఇరు రాష్ట్రాలు చర్చలు జరుపుతుండగానే అధికారులు ఖాతాలను స్తంభింపజేయడం సమర్థనీయం కాదని వాదించారు. 2014, మార్చి నుంచి 2019, సెప్టెంబర్ వరకు పీఎఫ్ అంచనాల్లోనూ లోపాలున్నట్టు తెలిపారు. పీఎఫ్ నగదు చెల్లింపులో టీజీఎస్ ఆర్టీసీ ఆలస్యం చేయలేదని, ఒకవేళ జరిగినా అది దీర్ఘకాలికం కాదని తెలిపారు. వాదనలు విన్న న్యాయమూర్తి.. కౌంటర్ దాఖలు చేయాలని రీజినల్ పీఎఫ్ కమిషనర్-2, రికవరీ ఆఫీసర్, యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా బ్రాంచ్ మేనేజర్‌కు ఆదేశాలు జారీ చేశారు.

అసెంబ్లీలో ఘనంగా జయశంకర్ వర్ధంతి

సాక్షి, హైదరాబాద్: తెలంగాణ రాష్ట్ర సాధన కోసం జీవితాన్ని అర్పించిన మహనీయుడు ప్రొఫెసర్ కొత్తపల్లి జయశంకర్ అని శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి పేర్కొన్నారు. జయశంకర్ వర్ధంతి సందర్భంగా అసెంబ్లీ కమిటీ హాల్‌లోని జయశంకర్ చిత్రపటానికి పూలమాల వేసి గుత్తా నివాళి అర్పించారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో తెలంగాణకు జరుగుతున్న అన్యాయాన్ని నిలదీయడంతో పాటు, ప్రత్యేక రాష్ట్ర సాధన కోసం చివరి శ్వాస వరకు కొట్లాడారన్నారు. ఈ కార్యక్రమంలో అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్, మండలి డిప్యూటీ చైర్మన్ బండ ప్రకాశ్, ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య, ఎమ్మెల్సీలు మధుసూదనాచారి, శేరి సుభాష్ రెడ్డి, అసెంబ్లీ సెక్రెటరీ నరసింహాచార్యులు తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణ భవన్‌లో.. బీఆర్‌ఎస్ కార్యాలయం తెలంగాణ భవన్‌లోనూ జయశంకర్ వర్ధంతి సందర్భంగా పార్టీ నేతలు ఆయన చిత్రపటానికి నివాళులర్పించారు. బండ ప్రకాశ్ తోపాటు మాజీ మంత్రులు మహమూద్ అలీ, జగదీశ్‌రెడ్డి, పార్టీ నేతలు పొన్నాల లక్ష్మయ్య, రావుల చంద్రశేఖర్‌రెడ్డి, బాల్క సుమన్, మన్నె గోవర్ధన్‌రెడ్డి తదితరులు జయశంకర్ విగ్రహానికి పూలమాల వేశారు.

ఎక్స్‌లో పోస్ట్ చేసిన కేటీఆర్, హరీశ్‌రావు

'ఆరు దశాబ్దాల పాటు తెలంగాణను స్వప్నించి, శాసించి మూడు తరాల ఉద్యమకారులకు ప్రేరణగా నిలిచిన మహా వ్యక్తి జయశంకర్'అని కేటీఆర్ 'ఎక్స్'లో పోస్ట్ చేశారు. 'తెలంగాణ రాష్ట్ర సాధనకు పోరుబాట చూపిన ఉద్యమ నేత, స్వరాష్ట్ర సాధనే ఊపిరిగా బతికిన సిద్ధాంతకర్త జయశంకర్'అని మాజీ మంత్రి హరీశ్‌రావు 'ఎక్స్'లో పేర్కొన్నారు.

నీట్‌పై స్పందించకపోతే కేంద్ర మంత్రులను తిరగనివ్వం

- అక్రమాలపై సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలి
- ఎన్‌ఎస్‌యూఐ, యూత్ కాంగ్రెస్ నేతలు బల్మూరి, శివసేనారెడ్డి

సాక్షి, హైదరాబాద్: నీట్ పరీక్షల్లో అక్రమాల కారణంగా 24 లక్షల మంది విద్యార్థులకు అన్యాయం జరిగిందని, అందుకే కేంద్ర మంత్రులు కిషన్‌రెడ్డి, బండి సంజయ్‌లను తెలంగాణలో తిరగనీయబోమని ఎన్‌ఎస్‌యూఐ రాష్ట్ర అధ్యక్షుడు, ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్, యూత్ కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షుడు ఎస్.శివసేనారెడ్డిలు హెచ్చరించారు. నీట్ పరీక్షలో అక్రమాలపై చర్యలు తీసుకోవాలని కోరుతూ దేశవ్యాప్తంగా చేపట్టిన ఆందోళనలో భాగంగా శుక్రవారం ఉదయం గాంధీభవన్ నుంచి ట్యాంక్‌బండ్ అంబేడ్కర్ విగ్రహం వరకు కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీలో ఎమ్మెల్సీ మహేశ్‌కుమార్‌గౌడ్, పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ టి. జగ్గారెడ్డి, మాజీ ఎంపీ అంజన్‌కుమార్ యాదవ్, ఏఐసీసీ కార్యదర్శి సంపత్‌కుమార్, ఎమ్మెల్యే దానం నాగేందర్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం గాంధీభవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వెంకట్, శివసేనాలు మాట్లాడుతూ నీట్ అక్రమాలపై సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. బిహార్, గుజరాత్, హరియాణాలలో పేపర్ లీక్ అయినట్టు ఆధారాలతో సహా రుజువైందని, అందుకే ఎవరూ పట్టించుకోకూడదన్న ఉద్దేశంతో లోక్‌సభ ఎన్నికల ఫలితాలు వచ్చిన రోజున నీట్ ఫలితాలు విడుదల చేశారని అన్నారు. ఈ పరీక్ష నిర్వహణలో నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్‌టీఏ)పై సందేహాలున్నందున ఆ పరీక్షను రద్దు చేసి మళ్లీ నిర్వహించాలని డిమాండ్ చేశారు. నీట్ కారణంగా నష్టపోయిన విద్యార్థులకు న్యాయం జరిగేంతవరకు తాము పోరాడుతామని, ఈనెల 24న పార్లమెంటును ముట్టడిస్తామన్నారు.



ర్యాలీలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ బల్మూరి. చిత్రంలో దానం, అంజన్ కుమార్ తదితరులు

ఏపీ శాసనసభ స్పీకర్‌గా అయ్యన్నపాత్రుడు



సాక్షి, అమరావతి: ఏపీ శాసన సభాపతి (స్పీకర్)గా టీడీపీ ఎమ్మెల్యే, మాజీ మంత్రి చింతకాయల అయ్యన్నపాత్రుడు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. స్పీకర్ పదవికి ఆయన ఒక్కరే నామినేషన్ దాఖలు చేయడంతో ఎన్నిక ఏకగ్రీవమైంది. స్పీకర్ ఎన్నికను శనివారం నిర్వహించాలని గవర్నర్ నిర్ణయించారని, నామినేషన్లను కార్యదర్శికి సమర్పించాలని ప్రొటెం స్పీకర్ గోరంట్ల బుచ్చయ్య చౌదరి శుక్రవారం సభకు తెలిపారు. ఆ తర్వాత అయ్యన్నపాత్రుడి తరఫున డిప్యూటీ సీఎం పవన్, మంత్రులు లోకేశ్, అచ్చెన్నాయుడు, నాదెండ్ల, సత్యకుమార్, పయ్యావుల అసెంబ్లీ కార్యదర్శికి నామినేషన్ పత్రాలు సమర్పించారు. ఈ పదవికి ఒక నామినేషనే రావడంతో ఆయన ఎన్నిక ఏకగ్రీవమైంది. శనివారం ఈ విషయాన్ని సభలో ప్రకటిస్తారు.

జిల్లా వార్తలు

రామయ్య సన్నిధిలో వికారాబాద్ కలెక్టర్



ప్రతీక్‌జైన్ దంపతులతో అర్చకులు, అధికారులు

భద్రాచలం: భద్రాచలంలోని శ్రీసీతారామ చంద్రస్వామిని శుక్రవారం వికారాబాద్ కలెక్టర్ ప్రతీక్‌జైన్ కుటుంబ సభ్యులతో దర్శించుకున్నారు. అంతరాలయంలో మూలమూర్తులను దర్శించుకుని పూజలు చేశారు. అర్చకులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. వేదాశీర్వచనం అందించి, తీర్థ ప్రసాదాలు అందించారు. కాగా, భద్రాచలం ఐటీడీఏ పీఓగా విధులు నిర్వర్తిస్తూ ఇటీవలే వికారాబాద్ కలెక్టర్‌గా ఆయన వెళ్లారు. ఆలయ ఈఈ రవీందర్, ఉద్యోగులు, అర్చకులు, పండితులు పాల్గొన్నారు.

నేడు పండితాపురం సంత వేలం

కామేపల్లి: మండలంలోని కొమ్మినేపల్లి(పండితాపురం) గ్రామ పంచాయతీ పరిధిలోని శ్రీ కృష్ణ ప్రసాద్ పశువుల వారాంతపు సంత నిర్వహణను అప్పగించేందుకు శనివారం బహిరంగ వేలం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ రవీందర్ తెలిపారు. సంత ఆవరణలో ఉదయం 11 గంటలకు వేలం ప్రారంభమవుతుందని పేర్కొన్నారు. పీసా చట్టం ప్రకారం జీపీ పరిధిలోని ఎస్టీలు మాత్రమే అర్హులని, రూ.30 లక్షలు ధరావత్తు, రూ.5 లక్షల సాల్వెన్సీని డీడీ లేదా నగదు రూపంలో చెల్లించి పాటలో పాల్గొనాలని సూచించారు. కాగా, గురువారం కూడా వేలం నిర్వహించినా ప్రభుత్వ మద్దతు ధర అయిన రూ.1,84,70,646 పలకపోవడంతో వాయిదా వేసిన విషయం విదితమే.

సింగరేణిలో డిపెండెంట్లకు ఇంటర్వ్యూలు

సింగరేణి(కొత్తగూడెం): కొత్తగూడెం కార్పొరేట్ ఏరియా విభాగాల్లో అనారోగ్య కారణాలతో మెడికల్ ఇన్‌వాలిడేషన్ అయిన కార్మికుల పిల్లలకు శుక్రవారం ప్రధాన కార్యాలయంలో ఇంటర్వ్యూలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఏజీఎం(వెల్ఫేర్) కోడూరి శ్రీనివాసరావు మాట్లాడుతూ ఇంటర్వ్యూల అనంతరం వైద్య పరీక్షల్లో కూడా అర్హత సాధిస్తే శిక్షణ ఇచ్చి పోస్టింగ్ కేటాయిస్తామని తెలిపారు. వివిధ విభాగాల అధికారులు పి.రాజశేఖర్, వి.రామకృష్ణ, బి.సుశీల్‌కుమార్, శైలజ, సాయి, స్వప్నిల్ తదితరులు పాల్గొన్నారు.

ఆదివాసీలకు ఆపన్నహస్తం

- ప్రతీ వారం చర్లలో అన్నదానం
- సంతకు వచ్చేవారు ఇబ్బంది పడకుండా నిర్వహణ
- 134 వారాలుగా కొనసాగుతున్న ఆనవాయితీ



ఆదివాసీలకు భోజనం వడ్డిస్తున్న సంస్థ సభ్యులు



భోజనం చేస్తున్న ఆదివాసీలు

చర్ల రూరల్: అనుకోకుండా వచ్చిన ఆలోచన... సుమారు మూడేళ్లుగా చర్లలో ప్రతీ ఆదివారం జరిగే వారాంతపు సంతకు వచ్చే ఛత్తీస్‌గఢ్‌తో పాటు భద్రాద్రి జిల్లాలోని ఆదివాసీ గ్రామాల నుంచి వస్తున్న వారి ఆకలి తీరుస్తోంది. ఈ సంతకు నిత్యావసర సరుకుల కోసం సుదూర ప్రాంతాల నుంచి ఆదివాసీలు రావడం ఆనవాయితీ. ఉదయమే సంతకు చేరుకునే వారు తమకు సామగ్రి కొనుగోలు చేసి సాయంత్రం తిరిగి గూడెంలకు వెళ్తారు. పిల్లాపాపలతో వచ్చే వారు కాస్త డబ్బు మిగిలితే టిఫిన్‌తో ఆకలి తీర్చుకోవడమే తప్ప కడుపు నిండా భోజనం చేసే పరిస్థితి ఉండదు. ఈనేపథ్యాన ఆదివాసీలకు ఒకపూట అన్నం పెట్టగలిగితే ఎలా ఉంటుందని 'మేమున్నాం.. మీ కోసం' సంస్థ బాధ్యులకు వచ్చిన ఆలోచన కార్యరూపం దాల్చి 134వారాల నుంచి కొనసాగుతోంది.

ఇలా మొదలైంది...

లయన్స్‌క్లబ్ ఆధ్వర్యాన ఓ ఆదివారం చర్ల హైస్కూల్‌లో వైద్య, ఆరోగ్యశిబిరం నిర్వహించారు. ఈ శిబిరానికి వచ్చిన వారి కోసం భోజనం కూడా సమకూర్చారు. అయితే, కొద్దిమందే భోజనం చేయడంతో చాలావరకు మిగిలిపోయింది. దీంతో ఏం చేయాలా అని ఆలోచించిన నిర్వాహకులు అదేరోజు వారాంతపు సంత ఉండడంతో అక్కడకు వచ్చిన ఆదివాసీలకు వడ్డించారు. వారంతా తృప్తిగా భోజనం చేసి నిర్వాహకులకు కృతజ్ఞతలు తెలిపారు. దీంతో ఎలాగైనా ప్రతీ ఆదివారం అన్నదానం చేయాలని నిర్ణయించుకున్నారు నాటి లయన్స్ క్లబ్ అధ్యక్షుడు, ప్రస్తుత మేమున్నాం.. మీ కోసం సంస్థ చైర్మన్ నీలి ప్రకాశ్. సంస్థ సభ్యులు, స్థానిక వ్యాపారులే కాక ఇతర ప్రాంతాల దాతలు చేయూతనిస్తుండడంతో ఆదివాసీల ఆకలి తీర్చేలా ఈ కార్యక్రమం సాఫీగా జరుగుతోంది.

బృందంగా ఏర్పడి...

ప్రతీ ఆదివారం ఆదివాసీలు వందల సంఖ్యలో సంతకు వస్తుంటారు. ఇందులో కనీసం 300 మందికి భోజనం పెట్టాలని సంస్థ బాధ్యులు లక్ష్యంగా నిర్దేశించుకున్నారు. ఇందుకోసం సంస్థ బాధ్యులు బృందంగా ఏర్పడి ముందుగానే దాతలను వెతుక్కుంటారు. కొందరు సంస్థ సభ్యులు కూడా ఆర్థికంగా, సామగ్రిపరంగా చేయూతనిస్తున్నారు. అలాగే, కార్యక్రమ వివరాలు తెలుసుకున్న ఇతర ప్రాంతాల దాతలు కూడా ముందుకొస్తుండడంతో సుదూర ప్రాంతాల నుంచి వచ్చే నిరుపేద ఆదివాసీల ఆకలి తీరుతోంది. ఆతర్వాత ఒక వాట్సాప్ గ్రూప్ ఏర్పాటుచేసి వారి అనారోగ్యంతో బాధపడుతున్న వారి వివరాలు కూడా పోస్ట్ చేసి సేకరించిన నగదుతో చేయూతనిస్తున్నారు. ఇటీవల చర్ల మండలం చింతకుంటకు చెందిన మచ్చా నవీన్ ప్రమాదంలో గాయపడగా చికిత్స కోసం రూ.15 వేలు అందించారు. అలాగే, చినమిడిసిలేరుకు చెందిన శ్యామల రవికుమార్ డెంగీతో మృతి చెందగా ఆయన కుటుంబానికి రూ.23 వేలు అందజేశారు.

జీవితాంతం కొనసాగిస్తాం...



సంతకు వచ్చే ఆదివాసీలకు జీవితాంతం అన్నదానం చేయాలనేదే మా లక్ష్యం. గాంధీబొమ్మ సెంటర్ వద్ద ప్రతీ ఆదివారం దాతల సహకారంతో అన్నదానం చేస్తున్నాం. ఇది ప్రతీ వారం నిరంతరాయంగా కొనసాగేలా ఎందరో చేయూతనిస్తున్నారు. అలాగే, మా సంస్థ సభ్యుల కృషితో సాఫీగా సాగుతోంది.

– నీలి ప్రకాశ్, చైర్మన్, మేమున్నాం మీ కోసం సంస్థ

బాధ్యతగా భావిస్తున్నాం...



సుదూర ప్రాంతాల నుండి చర్ల సంతకు ప్రతీ వారం వచ్చే ఆదివాసీల ఆకలి తీర్చడాన్ని బాధ్యతగా భావిస్తున్నాం. ఇందుకోసం చర్ల వాసులే కాక ఇతర ప్రాంతాల వారు సైతం సహకరిస్తుండడం గొప్ప విషయం. అన్నదానానికి ప్రతీ ఒక్కరి సహాయ, సహకారాలు ఇలాగే కొనసాగాలని ఆశిస్తున్నా.

– దొడ్డి సూరిబాబు, చర్ల

134 వారాలుగా కార్యక్రమం



అన్నిదానాల్లో అన్నదానం మిన్న అన్న సూక్తిని 'మేమున్నాం... మీ కోసం' సభ్యులు నిజం చేస్తున్నారు. ఇంట్లో పది మందికి భోజనాలు పెట్టాలంటే ఎంతో శ్రమించాలి. కానీ 134 వారాల పాటు 300 మందికి భోజనాలు పెట్టడం.. అందుకు సహకరించే అదృష్టం మాకు లభించడం ఆనందంగా ఉంది.

– బుచ్చావరపు ప్రతాప్, వ్యాపారి, చర్ల

బయో డైవర్సిటీ బృందం పర్యటన

దమ్మపేట/అశ్వారావుపేటరూరల్ : భద్రాద్రి జిల్లా దమ్మపేట, అశ్వారావుపేట మండలాల్లోని పలుగ్రామాల్లో బయో డైవర్సిటీ సాంకేతిక బృందం శుక్రవారం పర్యటించింది. జాతీయ బయోడైవర్సిటీ సాంకేతిక కమిటీ చైర్మన్ సి.అచలేందర్ రెడ్డి, ఐఎఫ్‌ఎస్‌లు కృష్ణమూర్తి, జయరాజ్, ఏపీ చైర్మన్ జయ్‌రాజ్, పెదవేగి సీనియర్ శాస్త్రవేత్త ఎంవీ ప్రసాద్, భద్రాద్రి జిల్లా ఉద్యాన శాఖాధికారి సూర్యనారాయణ దమ్మపేట, అఖినేపల్లి, నారంవారిగూడెం, అశ్వారావుపేటలోని ఆయిల్‌పామ్ తోటలు, అప్పారావుపేటలోని పామాయిల్ ఫ్యాక్టరీని సందర్శించారు. ఆయిల్‌పామ్ రైతులకు ప్రభుత్వం నుంచి అందుతున్న రాయితీలు, ప్రోత్సాహకాలను అధికారుల ద్వారా తెలుసుకున్న వారు రైతులతో మాట్లాడి పెట్టుబడి, దిగుబడిపై ఆరాతీశారు. ఆయిల్‌పాం తోటలను సాగు చేసే గిరిజన రైతులను ప్రోత్సహించనున్నట్లు తెలిపారు. ఉద్యాన అధికారి సందీప్, ఆయిల్‌ఫెడ్ డివిజనల్ మేనేజర్ బాలకృష్ణ, రాజశేఖరరెడ్డి, డీసీహెచ్‌ఎస్‌ఓ సూర్యనారాయణ, శాస్త్రవేత్త డాక్టర్ ఎం.వీ. ప్రసాద్, ఫ్యాక్టరీ మేనేజర్ కల్యాణ్ పాల్గొన్నారు.

రోడ్డెక్కని ఫుడ్ సేఫ్టీ వాహనం

- అక్కడికక్కడే నాణ్యత పరీక్షించేందుకు వీలు
- ఐదు జిల్లాలకు కలిపి కేటాయించిన కేంద్రప్రభుత్వం
- సిబ్బంది సైతం ఉన్నా వినియోగించని అధికారులు
- జిల్లాల్లో కల్తీ ఆహారంపై కొరవడుతున్న నియంత్రణ



కలెక్టరేట్ ఆవరణలో నిలిపిన ఫుడ్ సేఫ్టీ మొబైల్ టెస్టింగ్ వాహనం



మరమ్మతుకు వచ్చిన సైడ్ వాల్, మైక్

ఖమ్మంమయూరిసెంటర్: తీరిక లేని జీవన విధానంతో ప్రజల ఆహారపు అలవాట్లు మారుతున్నాయి. అంతేకాక సమయం చిక్కకపోవడంతో ఇంటి భోజనం కంటే బయట తయారుచేసిన ఆహారంపై ఆసక్తి కనబరుస్తున్నారు. ఇదే సమయాన ప్రజల బలహీనతను హోటళ్ల నిర్వాహకులు సొమ్ము చేసుకుంటున్నట్లు ఇటీవల వెల్లడైంది. హోటళ్లు, రెస్టారెంట్లు, బేకరీ నిర్వాహకులు నాణ్యత లేని, నిల్వ ఉంచిన భోజనం, ఆహార పదార్థాలు, తినుబండారాలను అందిస్తూ ఆరోగ్యంతో చెలగాటమాడుతున్నారు. ఇటీవల ఖమ్మం, భద్రాచలం తదితర ప్రాంతాల్లో చేపట్టిన తనిఖీల్లో హోటళ్ల నిర్వాహకులు బండారం బయటపడింది. అయితే, ఎప్పటికప్పుడు క్షేత్రస్థాయిలో తనిఖీ చేసి ఆహారం నాణ్యతను నిర్ధారించేందుకు ప్రభుత్వం సమకూర్చిన 'ఫుడ్ సేఫ్టీ ఆన్ వీల్స్' వాహనాన్ని మాత్రం అధికారులు కలెక్టరేట్ నుండి బయటకు తీయడం లేదు. నాలుగు నెలలుగా కలెక్టరేట్ ఆవరణలోనే వాహనాన్ని నిలిపి.. అది పాడవుతున్నా పట్టించుకోకపోవడం విమర్శలకు తావిస్తోంది.

కల్తీని కనిపెట్టేలా..

కల్తీ ఆహారంపై ప్రజల నుండి ఫిర్యాదులు అందినా, అధికారులకు సమాచారం వచ్చినా అక్కడికక్కడే తనిఖీ చేసి నాణ్యతను తేల్చేలా కేంద్ర ప్రభుత్వం మైక్రో బయాలజీ ల్యాబ్ యూనిట్ మొబైల్ వాహనాన్ని అందజేసింది. రూ.1.50 కోట్ల విలువైన ఈ వాహనంలో టెస్టింగ్ ల్యాబ్‌తో పాటు వ్యాపారులకు తక్షణ సేవలు అందించేందుకు రిజిస్ట్రేషన్, లైసెన్స్ జారీకి కావాల్సిన పరికరాలు, కల్తీపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు ప్రొజెక్టర్లు, పిక్చర్ వాల్స్ కూడా పొందుపర్చారు. ఈ వాహనంలో జనరేటర్, సేకరించిన శ్యాంపిళ్లు చెడిపోకుండా ఆధునిక పరికరాలు, ఏసీలను సైతం ఏర్పాటు చేశారు. ఈ వాహనం ద్వారా ఖమ్మం, భద్రాద్రికొత్తగూడెం, నల్లగొండ, సూర్యాపేట, యాదాద్రి జిల్లాల్లో తనిఖీలు చేపట్టాల్సి ఉండగా.. ఇన్ని జిల్లాల మాటేమో కానీ ఖమ్మం కలెక్టరేట్ నుండి సైతం బయటకు తీయకపోవడం గమనార్హం.

కొరవడుతున్న పర్యవేక్షణ..

ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో వందల సంఖ్యలో హోటళ్లు, రెస్టారెంట్లు, టిఫిన్ సెంటర్లు, బేకరీలు, కార్ఖానాలు ఉన్నాయి. వీటిని నిరంతరం తనిఖీ చేయాల్సి ఉన్నా అధికారులు, సిబ్బంది కొరతతో అలా జరగడంలేదు. ఇటీవల అధికారులు చేపట్టిన తనిఖీల్లో నిల్వ ఉన్న మాంసం, పాచిపోయిన ఆహారం, బూజుపట్టిన ఐస్‌క్రీమ్‌లు బయటపడగా.. మిగిలిన వాటిల్లో పరిస్థితి ఎలా ఉందోనన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. కార్ఖానాల్లో రోజుల తరబడి ఉపయోగించిన నూనెలోనే పిండి వంటలు చేస్తున్నారన్న ఆరోపణలు వస్తున్నాయి. నిరంతరం వీటిని తనిఖీ చేసి నిర్వహణ సక్రమంగా చేపట్టిన వారిపై చర్యలు తీసుకోవాల్సి ఉన్నా అధికారులు పట్టించుకోవడం లేదు. ఎక్కడైనా ఫిర్యాదు అందినప్పుడే తనిఖీ చేయడం, నోటీసులతో సరిపెడుతుండడంతో హోటళ్ల నిర్వాహకులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు.

తూతూ మంత్రంగానే..

జిల్లాలో ఆహార కల్తీపై ప్రజలకు అవగాహన కల్పించడంతోపాటు పరీక్షలు చేయడంపై అధికారులు దృష్టి సారించడం లేదు. అడపాదడపా తనిఖీలు చేస్తున్నా ప్రజలకు అవగాహన కల్పించడంలో మాత్రం పూర్తిగా విఫలమవుతున్నారు. మొబైల్ టెస్టింగ్ వాహనాన్ని ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాతో పాటు నల్లగొండ, సూర్యాపేట, యాదాద్రి జిల్లాలకు 2022 జూలై నెలలో కేంద్రం కేటాయించింది. తొలినాళ్లలో డ్రైవర్, టెక్నీషియన్, సిబ్బంది లేరంటూ మూలనపెట్టారు. ఆతర్వాత కలెక్టర్ చొరవతో టెక్నీషియన్, డ్రైవర్, అటెండర్‌ను ఇచ్చినా పూర్తి స్థాయిలో వాహనాన్ని వినియోగించడం లేదు. గతేడాది నామమాత్రంగా ఖమ్మంలో అక్కడక్కడా వాహనం తిప్పి ప్రజల్లో కల్తీ ఆహారంపై అవగాహన కల్పించినట్లు చెబుతున్న పూర్తి స్థాయిలో మాత్రం అప్పుడు, ఇప్పుడూ జరగడం లేదు.

ఇక నుండి పరీక్షలు, అవగాహన

స్కూళ్ల, హాస్టళ్ల సెలవులు ఉండడంతో ఇన్నాళ్లు మొబైల్ వాహనాన్ని వినియోగించలేదు. ఇటీవల పాఠశాలలు తెరుచుకున్న నేపథ్యాన ఇక నుండి ఈ వాహనం ద్వారా ఆహార తనిఖీ పరీక్షలు ముమ్మరం చేస్తాం. అంతేకాక ప్రజలకు అవగాహన సైతం కల్పించనున్నాం.

– ఆర్.కిరణ్‌కుమార్, జిల్లా గెజిటెడ్ ఫుడ్ ఇన్‌స్పెక్టర్